ప్రజాశక్తి

మంగళవారం 10 జనవరి 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

నేటి నుంచి ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

- అందుబాటులో 950 సంక్రాంతి సర్వీసులు
- సాధారణ ఛార్జీలతోనే ప్రయాణం
- టికెట్ల బుకింగ్లో రాయితీలు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఎపిఎస్ ఆర్‌టిసి వారు మంగళశారం నుండి ప్రత్యేక సర్వీసులను ప్రవేశపెడుతున్నారు. మొత్తం 950 ఆర్‌టిసి బస్సులను ఇందుకోసం అందుబాటులో ఉంచారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌తోపాటు ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు. పండుగ అనంతరం స్వస్థలాల నుంచి తిరుగు ప్రయాణాలకు కూడా సర్వీసులను ఏర్పాటు చేశారు. పండుగ నిమిత్తం తమ సొంతూళ్లకు వెళ్లే వారి కోసం వీటిని ప్రయాణికులకు అందుబాటులోకి తేనున్నారు. ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు సర్వీసులు నడవనున్నాయి. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నైతోపాటు రాజమండ్రి, విశాఖపట్నం, అమలాపురం, కాకినాడ తదితర ప్రాంతాలకు సంక్రాంతి ప్రత్యేక సర్వీసులను నడుపుతారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు 343, రాజమండ్రికి 205, విశాఖపట్నానికి 130, బెంగుళూరుకు 12, చెన్నైకి 35 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. విజయవాడలో చదువుకుంటున్న రాయలసీమ ప్రాంత విద్యార్థుల సౌకర్యార్థం కూడా సర్వీసులు ఏర్పాటు చేశారు. రాయలసీమ ప్రాంతానికి వెళ్లేందుకు 40 బస్సులను అందుబాటులో ఉంచారు. మిగిలిన ప్రాంతాలకు మరో 185 బస్సులను అందుబాటులోకి ఉంచనున్నారు. హైదరాబాద్‌కు జనవరి 11న 30 బస్సులు, 12న 60 బస్సులు, 13న 45 బస్సులు, 16న 80 బస్సులు, 17న 80 బస్సుల చొప్పున నడపనున్నారు. అలాగే 11న

రాజమండ్రికి 40 బస్సులు, విశాఖకు 18 బస్సులు, 12న రాజమండ్రికి 50 బస్సులు, విశాఖకు 20 బస్సులు, 13న 50 బస్సులు, విశాఖకు 26 బస్సులను నడపనున్నారు. ఈసారి గతంలోలాగా సంక్రాంతి ప్రత్యేక సర్వీసుల్లో అదనపు చార్జీలు వసూలు చేయడంలేదు. సాధారణ ఛార్జీలతోనే ప్రయాణించే అవకాశం కల్పించారు. ఆన్‌లైన్ ద్వారా కూడా టికెట్లను బుక్ చేసుకోవచ్చు. రాను పోను ఒకేసారి టికెట్లను తీసుకున్న వారికి తిరుగు ప్రయాణ సమయంలో చార్జీలో 10 శాతం రాయితీ ఇవ్వనున్నారు. ఎపిఎస్ఆర్‌టిసి ఇవాలెట్ ద్వారా టికెట్ బుక్ చేసుకున్న వారికి 5శాతం, పిల్లలతో కలిపి నలుగురు సభ్యులు ఒకేసారి టికెట్ బుక్ చేసుకుంటే 5 శాతం, 60 ఏళ్ల పైబడిన వారికి 25 శాతం రాయితీలను ఇవ్వనున్నారు. ప్రత్యేక సర్వీసుల పర్యవేక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రమాణికులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పండిట్ నెహ్రూ బస్ స్టేషన్లో 24 గంటలూ అధికారులను అందుబాటులో ఉంచుతామని ఎపిఎస్ఆర్‌టిసి ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.ఏసుదాను సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణీకుల సమస్యల పరిష్కారానికి డిప్యూటీ సిటిఎం సెల్: 9515125823, ఎటిఎం సెల్: 9959225454, స్టేషన్ మేనేజర్ సెల్: 9959225467 నెంబర్లలో సంప్రదించొచ్చని తెలిపారు.

తప్పులతడక

- భూ రీ సర్వేలో తీవ్ర వ్యత్యాసాలు
- యజమానుల్లో ఆందోళన

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

వైఎస్ఆర్ శాశ్వత భూ హక్కు భూరక్ష పథకంలో భాగంగా జరుగుతున్న భూముల రీ సర్వే ఫార్సుగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూముల విస్తీర్ణం తగ్గిపోవడంతో కొందరు భూయజమానులు ఆందోళన చెందుతున్నారు. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా రీ సర్వే వ్యవహారం సాగుతోందని వాపోతున్నారు.

కసుకుర్తి కృష్ణారావు



ఫారం-46

ఆంధ్రప్రదేశ్ సర్వే మరియు సరిహద్దుల చట్టం, 1923 లోని 9(2) సెక్షన్ ప్రకారము నోటీసు

రంగన్నగూడెంనకు చెందిన కసుకుర్తి కృష్ణారావుకు వచ్చిన నోటీసు

కృష్ణాజిల్లా బాపులపాడు మండలం రంగన్నగూడెంనకు చెందిన కోగంటి చంద్రప్రభకు ఆ గ్రామంలోని సర్వే నంబర్ 43-2 ఎల్ో 1.05 ఎకరాలు, 43-2 సిలో 2.21 ఎకరాలు, మొత్తం 3.26 ఎకరాల భూమి ఉంది. ఈ మొత్తం ఖాతా నంబర్ 806లో ఆమె పేరుతోనే నమోదైంది. రీ సర్వే తర్వాత ఆమెకు ల్యాండ్ పార్శిల్ నంబర్ 669 కేటాయించారు. దీనిలో 107 సెంట్లు (1.07 ఎకరాలు) మాత్రమే ఆమె పేరుతో చూపారు. సర్వే నంబర్ 43-2 సిలోని విస్తీర్ణం 2.21 ఎకరాలు కనిపించడం లేదు. ఈ విస్తీర్ణాన్ని



ఫారం-46

ఆంధ్రప్రదేశ్ సర్వే మరియు సరిహద్దుల చట్టం, 1923 లోని 9(2) సెక్షన్ ప్రకారము నోటీసు

రంగన్నగూడెంనకు చెందిన కోగంటి చంద్రప్రభకు వచ్చిన నోటీసు

నిర్ధారించాల్సిందిగా రీ సర్వే అధికారి నోటీసులు ఇవ్వడంతో ఆమె ఆందోళనకు గురవుతున్నారు. కసుకుర్తి కృష్ణారావుకు 5.46 ఎకరాలకు విస్తీర్ణానికిగానూ 4. 80 ఎకరాలుగా మాత్రమే రీ సర్వేలో చూపారు. 66 సెంట్లు తక్కువగా నమోదైంది. ఈ గ్రామంలో 1,615 ఎకరాలకుగానూ 1400 ఎకరాల్లో తప్పులు దొర్లాయని రైతులు వాపోతున్నారు. గుడివాడ రూరల్ మండలం బొమ్ములూరుకు చెందిన అట్లూరి శేషగిరిశైలు తమ కుటుంబానికి చెందిన 5.91 ఎకరాల విస్తీర్ణంలో రీ సర్వే తర్వాత 70 సెంట్లు తగ్గిందని అధికారులకు ఫిర్యాదు చేశారు. బందరు మండలం పొట్లపాలెం గ్రామస్తులు పలువురు రీ సర్వేలోపాలు సవరించాలని అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఒకే పార్శిల్ నంబర్‌లో ఇద్దరు ముగ్గురు రైతులకు సంబంధించిన భూముల వివరాలను నమోదు చేయడం సమస్యగా ఉందని భూ యజమానులు వాపోతున్నారు. జిల్లాలో మొత్తం 502 రెవెన్యూ గ్రామాలున్నాయి. మొదటి దశలో 100 గ్రామాలకు 31 నోటిఫికేషన్ అక్టోబర్లో విడుదల

(మిగతా 6లో)

గోవా జాతీయ క్రీడల్లో పతకాలే లక్ష్యం

శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

స్విమ్మింగ్‌పూల్, వ్యాయామశాలను ప్రారంభిస్తున్న శాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : అంతర్జాతీయ స్థాయిలోనే కాకుండా గోవాలో జరిగే జాతీయ క్రీడల్లో రాష్ట్ర క్రీడాకారులు పతకాలు సాధించడమే లక్ష్యంగా శ్రమించాలని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అన్నారు. మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ సెంటర్‌లో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యాన పునరుద్ధరించిన స్విమ్మింగ్ పూల్‌ను, నూతనంగా ఏర్పాటు చేసిన వ్యాయామశాలను సోమవారం ఆయన మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య(నాని) తనయుడు పేర్ని కిట్టుతో కలిసి ప్రారంభించారు. జిమ్ పరికరాలను పరిశీలించారు. ట్రెడ్ మిల్‌పై కొద్దిసేపు నడిచారు. అనంతరం జరిగిన సభలో సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రోత్సాహంతో శాప్ ఆధ్వర్యంలో నిరంతరం క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇటీవల జగనన్న క్రీడా సంబరాలు ఎంతో ఘనంగా నిర్వహించామన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి వైఎస్ఆర్ క్రీడా ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు స్పోర్ట్స్ అకాడమీలకు స్థలాలను కేటాయించామని తెలిపారు. ఎక్కువ మంది క్రీడాకారులకు అవకాశాలు దక్కాలనే ఉద్దేశంతో స్పోర్ట్స్ ఈవెంట్స్ ఎక్కువగా నిర్వహిస్తున్నామని, దీనికనుగుణంగా మంచి ఫలితాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. వచ్చే వేసవిలో వివిధ క్రీడాంశాల్లో టోర్నమెంట్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక శాసన సభ్యులు పేర్ని నాని కోరిక మేరకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మచిలీపట్నంలో శాప్‌కు రెండెకరాల స్థలాన్ని కేటాయించారని తెలిపారు. దీనికి నిధులు సమకూర్చి ఆ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి వివిధ టోర్నమెంట్లను నిర్వహిస్తున్న ప్రైవేట్ సంస్థలు, మాజీ క్రీడాకారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బందరు ఆర్‌డిఒ కె.కిషోర్, నగరపాలక సంస్థ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ కె.ఝాన్సీలక్ష్మీ, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్‌ను సత్కరించారు. ముందుగా కలెక్టర్ బంగ్లాలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పి జాషువాలను శాప్ చైర్మన్ బైరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.

అసమ్మతులకు బుజ్జగింపులు?

- రంగంలోకి వైసిపి పరిశీలకులు, పికె టీం సభ్యులు, ఐ ప్యాడ్ సిబ్బంది
- ససేమిరా అంటున్న నేతలు
- టిడిపిలోకి ఆహ్వానించేందుకు ప్రయత్నాలు !

ప్రజాశక్తి కంచికచర్ల : నందిగామ నియోజకవర్గంలో అసమ్మతి నేతలను బుజ్జగించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నేతల తీరు నచ్చక ద్వితీయ శ్రేణి నాయకులు అసమ్మతిగా ఉన్నారు. దీంతో ఎన్నికలకు ఏడాది గడువు ఉండగానే ఇప్పటి నుంచే అసమ్మతి నాయకులను బుజ్జగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏ మండలంలో, ఏ గ్రామంలో గుర్తింపు కలిగి, పార్టీపై అసమ్మతిగా ఏ నాయకులు, కార్యకర్తలు ఉన్నారో వివరాలు సేకరించే పనిలో పికె టీం సభ్యులు, ఐ ప్యాడ్ సిబ్బంది ఉన్నట్లు తెలిసింది. అంతేగాక నేరుగా పికె టీం సభ్యులనే అసమ్మతి నాయకులు, కార్యకర్తలను బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా కంచికచర్ల మండలంలో కీలకమైన నాయకుడిని తిరిగి పార్టీలోకి తెచ్చుకోవాలని అధికార పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. అధికారంలోకి వచ్చాక పరిటాలలో కీలకంగా నాయకుడిని పక్కన పెట్టారు. 42 నెలలుగా పార్టీకి దూరంగా ఉంటున్న అసమ్మతి నాయకుడిని తిరిగి తెచ్చేందుకు రెండు రోజులుగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఆదివారం పికె టీంకు చెందిన కొంతమంది సభ్యులతోపాటు వీరులపాడు మండలానికి చెందిన ఓ నాయకుడుతో కలిసి అసమ్మతి నాయకుడిని కలిసి వైసిపిలో కొనసాగి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. నందిగామలో సోమవారం జరిగే పార్టీ కీలక నాయకులు, కార్యకర్తల సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. అయితే ఈ విజ్ఞప్తిని సదరు అసమ్మతి నాయకుడు తిరస్కరించినట్లు తెలిసింది. "42 నెలలుగా తన అవసరం లేనట్లుగా అధినాయకత్వం వ్యవహరించింది. అప్పటి నుండి నేను రాజకీయాలకు, ప్రజలకు దూరంగా ఉన్నాను. నన్ను కాదనుకున్న నాయకుల దగ్గరకు రావటం ఇష్టంలేదు" అని సున్నితంగా తిరస్కరించినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు వెంటనే మేల్కొని వైసిపి అసమ్మతి నాయకుడిని కలిసి టిడిపిలోకి ఆహ్వానించినట్లు సమాచారం. ఇప్పటికే అసమ్మతి నాయకుడికి కొంత కాలంగా నియోజకవర్గంలోని కీలకమైన టిడిపి నాయకులు టచ్‌లో ఉన్నట్లు సమాచారం. అయితే టిడిపి నాయకుల ఆహ్వానాన్ని కూడా ఆ నేత సున్నితంగా తిరస్కరించినట్లు తెలిసింది. సమయం వచ్చినప్పుడు సరైన నిర్ణయం తీసుకుంటానని, దానికి కొంత సమయం కావాలని అన్నట్లు తెలిసింది. త్వరలో గ్రామంలోనూ, మండలంలోనూ అనుచరులు, బంధువులు, శ్రేయోభిలాషులతోపాటు వైసిపిలోని

(మిగతా 6లో)

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు : సిఐ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణ శివారు అనాసాగరం-శనగపాడు రోడ్డులో రోడ్డు ప్రమాదాలు జరగకుండా నందిగామ సిఐ సతీష్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. శనగపాడు రోడ్లో మలుపులు వద్ద ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. దీనిపై వెంటనే స్పందించిన సిఐ సతీష్ సోమవారం రోడ్డుకు ఇరువైపులు అడ్డుగా ఉన్న చెట్లు తొలగించారు. మలుపు వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. రోడ్డు గుంతలు ఉన్నచోట మరమ్మతులు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పండు దొర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి సర్పంచ్ ఆత్మహత్య

ప్రజాశక్తి-వత్సవాయి: మండలంలోని పెద్దమోదుగుపల్లి గ్రామ వైసిపి సర్పంచ్ కళ్యాణపు తేజస్విని(34) ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఇటీవల కాలంలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఎస్ఐ అభిమన్యు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తేజస్వినికి ఇద్దరు మగ పిల్లలు. ఆమె భర్త సాగర్ వైసిపి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పని చేస్తున్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎంపి

ప్రజాశక్తి-నందిగామ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపి ఆయోధ్య రామిరెడ్డి పేర్కొన్నారు. నందిగామ నియోజకవర్గ వైసిపి కార్యకర్తల సమావేశం సోమవారం నందిగామ శ్రీకరం కళ్యాణ మండపంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపి 175 స్థానాల్లో విజయం సాధించేలా పార్టీ శ్రేణులు కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా పరిశీలకులు మర్రి రాజశేఖర్, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ తాతినేని పద్మావతి, ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, ఎంఎల్సి మొండితోక అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ ఫెస్టివల్‌కు ఎల్‌బిఆర్‌సిఇ విద్యార్థులు

ప్రజాశక్తి-మైలవరం: 26వ నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు స్థానిక ఎల్‌బిఆర్‌సిఇ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు సోమవారం తెలిపారు. తమ కళాశాలలో చదువుతున్న ఎస్.ఊహ జాహ్నవి, మీన మహిత ఈ నెల 12 నుంచి 16 వరకు భారతదేశ యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కర్ణాటకలో జరిగే ఫెస్టివల్‌లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా యూత్ ఫెస్టివల్‌కి ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-నందిగామ: మాగల్లులోని ఖాసీం ఖాసిం వద్ధాశ్రమంలో గత ఎనిమిది సంవత్సరాల నుంచి ఆశ్రమంలో ఉంటున్న జరబన నరసింహారావు సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. మృతుని తాలూకా బంధువులు ఎవరూ లేకపోవడంతో ఆశ్రమ నిర్వాహకులు, టిడిపి విజయవాడ పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ కరీముల్లా అంత్యక్రియలను నిర్వహించారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు పట్టణంలో రూ.60 లక్షలతో నిర్మాణం చేపట్టనున్న సిమెంట్ రోడ్ల పనులను ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. అంతకుముందు ఆయన తన కార్యాలయంలో ప్రజా సంకల్పయాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వైసిపి కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కాస్తూరిభాయి, ఎఎంసి చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జడ్పిటిసి యరమల రామచంద్రారెడ్డి, కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆర్చరీ పోటీలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: నగరంలోని వి.ఆర్.సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న చెరుకూరి లెనిన్ ఓల్గా మెమోరియల్ అండర్-14 జాతీయ స్థాయిత ఆర్చరీ పోటీలు ఉత్సాహ భరితంగా జరుగుతున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుండి వచ్చిన క్రీడాకారులతో కళాశాల ప్రాంగణం కళకళలాడుతుంది. సోమవారం ఉదయం మిడ్‌లే కాంపౌండ్, రికర్వ్ విభాగంలో పోటీలు జరిగాయి. కాంపౌండ్ విభాగం 50 మీటర్ల విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎం.సుహాస్ ప్రథమ స్థానం సాధించగా, తమిళనాడుకు చెందిన నిఖజల్ రాజ్ ద్వితీయ స్థానం, హర్యానాకు చెందిన మన్‌వీర్ తృతీయ స్థానం సాధించారు. 50 మీటర్లు బాలికల విభాగంలో మాదల సూర్య హంసిని (ఆంధ్రప్రదేశ్), వి.రాణా (ఉత్తర ప్రదేశ్), పూజా పల్లవి (తమిళనాడు) వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. రికర్వు 50 మీటర్ల విభాగంలో ఆదిత్య జావా (రాజస్తాన్), ఎల్.ఆర్.ఎస్.సర్వేష్ (తమిళనాడు), రుద్ర కుమార్ (ఢిల్లీ) వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు.

నోటి ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

డాక్టర్ వైఎస్ఆర్ చిరునవ్వు కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు నోటి ఆరోగ్యంపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కాల్గేట్ పామోటివ్ సీఈవో ప్రభా నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు నోటి ఆరోగ్యంపై అవగాహణ కల్పించేందుకు కొల్గేట్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను, వివిధ ప్రాంతాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులకు నోటి పరిశుభ్రతపై, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ద్వారా వారికి అవగాహణ కలగడంతో పాటు పలువురికి తెలియచేస్తారని తెలిపారు. కార్యక్రమం నిర్వహణలో భాగంగా వివిధ ప్రాంతాలలో ప్రభుత్వ అధికారులను కూడా భాగస్వామ్యం చేస్తున్నామన్నారు.

రెడ్‌మి నోట్ సూపర్ ఛార్జింగ్ ఆవిష్కరణ

నెంబర్ వన్ స్మార్ట్ ఫోన్ బ్రాండ్ రెడ్‌మినోట్ 12 సిరీస్ సూపర్ ఛార్జింగ్‌ను ఆవిష్కరించినట్లు సంస్థ ప్రతినిధి ఎం.ఎస్.ఆర్.కె.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్‌మి నోట్ సిరీస్‌కు అనుగుణంగా సరికొత్తగా చార్జింగ్ , సూపర్ డిస్‌ప్లేను తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈపరికరాలు రెడ్‌మి నోట్ సిరీస్‌కు కొత్త కోణాన్ని అందిస్తుందన్నారు. అన్ని ఎలక్ట్రానిక్ షోరూమ్‌లలో లభ్యమవుతుందని తెలిపారు. రెడ్‌మి నోట్ వినియోగదారులు ఇక నుండి చార్జింగ్ వలన ఇబ్బందులు లేకుండా ఉంటాయని తెలిపారు.

నెక్స్‌జెన్‌ను ఆవిష్కరించిన ఎంజి మోటార్స్

ఎం.జి.మోటార్స్ ఆధ్వర్యంలో నెక్స్ జెన్ హెక్టార్ కారును ఆవిష్కరించినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ చబా ఒక ప్రకటనలో తెలిపారు. అత్యాధునిక ఫీచర్లతో 5, 6, 7 సీటర్ల సమగ్రాకృతిలో నెక్స్‌జన్ వాహశ్రీం అందరి మన్ననలను పొందుతుందన్నారు. విలాసవంతమైన ఇంటీరియర్స్, విశాలమైన స్థలాన్ని అందిస్తుందన్నారు. వినియోగదారుల వద్ద నుండి వస్తున్న అద్భుతమైన స్పందనను అనుసరించి సరికొత్తగా మార్పులు చేసి తీసుకువచ్చినట్లు తెలిపారు.

జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఎన్‌టిటిపియస్ పాతగేటు వద్ద జాతీయ బిసి సంక్షేమ సంఘ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, ఎనర్జీ సెక్రటరీ విజయానంద్ సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగి రాజు మహాత్మా జ్యోతిరావు పూలే వేషధారణలో వచ్చి అందరిని ఆశ్చర్యచకితులను చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు జికె వీరభద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, రాజయ్య, ఎం శ్రీధర్, చిన్నబాబు, పుల్లారావు, శ్రీహరి, నారాయణరావు, శ్రీరాములు పాల్గొన్నారు.

అండర్-15 క్రికెట్ కెప్టెన్‌గా డిఎవి విద్యార్థిని

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: డాక్టర్ ఎన్‌టిటిపియస్ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న డిఎవి పాఠశాలలో 10వ తరగతి చదువుతన్న యమ్‌డి జష్రామెహెక్ అండర్ 15 ఆంధ్రప్రదేశ్ క్రికెట్ టీమ్ కెప్టెన్‌గా ఎంపికైనట్లు డిఎవి పాఠశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డి.ఇందిరా ప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో విద్యార్థినిని పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు వి.రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

స్పందనలో మూడు అర్జీలు

ప్రజాశక్తి-కంచికచర్ల: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలపై మూడు అర్జీలు అందినట్లు తహశీల్దార్ రాజకుమారి తెలిపారు. ప్రతి సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు ప్రజల నుండి అర్జీలు సేకరించడానికి అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీవో కె బాలశంకర్, మండల మహిళా సమైక్య అధికారి కె.భాస్కరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

నందిగామ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-నందిగామ: పట్టణ పరిధిలోని ఐదో వార్డులో సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎస్.జయరాం పర్యటించారు. వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను పరిశీలించారు. రోడ్లపై చెత్త వేస్తే అపరాధ రుసుము విధించాలని సిబ్బందికి ఆదేశించారు. డ్రెయిన్‌లలో పూడికను షెడ్యూల్ ప్రకారం తొలగించేందుకు గ్యాంగ్ వర్క్ నిర్వహించాలన్నారు. గాంధీ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్, పరిసర ప్రాంతాలలో చెత్త వేస్తున్న వారిని గుర్తించి అపరాధ రుసుము విధించాలని ఆదేశించారు.

రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ: రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరిపేటలో రూ.49.65 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన రహదారులను డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఇసరపు దేవీ రాజారమేష్‌లతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈ గురునాథం, డివిజన్ కోఆర్డినేటర్ కాళ్ల ఆదినారాయణ పాల్గొన్నారు. అనంతరం 25వ డివిజన్ 96వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బంకా శకుంతలదేవి, అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైసిపి ధ్యేయం

ప్రజాశక్తి-మైలవరం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్ అన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర పూర్తి చేసి నాలుగేళ్లు అయిన సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని, అభివద్ధి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్మన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని చంద్రాల గ్రామంలో రూ.32.75 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవన నిర్మాణానికి కెడిసిసి చైర్‌పర్సన్ తన్నీరు నాగేశ్వరావుతో కలిసి ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కెడిసిసి డైరెక్టర్ గుమ్మడపు రవీందర్ రాణా, సర్పంచ్ జ్యోతి, గంగాధర్‌రావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విజయవాడరూరల్: ప్రసాదంపాడులో మాజీ ఎఎంసి చైర్మన్ కొమ్మ కోటేశ్వరరావు కేకును కట్ చేశారు. ముందుగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని కోదాడ రోడ్డులోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ దేశ రాజకీయాల్లోనే ప్రజాసంకల్ప యాత్ర చరిత్రాత్మకమన్నారు. పాదయాత్ర ద్వారా కోట్లాది మంది ప్రజల కష్టాలు తెలుసుకుని అధికారంలోకి వచ్చిన జగన్ వెంటనే చెప్పిన వాగ్దానాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ (బాజీ), యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవాని ప్రసాద్, పట్టణ కౌన్సిలర్లు వట్టెం మనోహర్, తన్నీరు నాగేంద్ర, గింజుపల్లి వెంకట్రామయ్య, కోఆప్షన్ సభ్యులు ఖాదర్ బాబు, షాది ఖానా చైర్మన్ ఎక్బైడ్ భాష తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విజయవాడ: సెంట్రల్ నియోజకవర్గంతో పాటు కృష్ణలంకలో అధికార వైసిపి పలు కార్యక్రమాలను నిర్వహించింది. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక పలువురు కార్పొరేటర్లతో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు నియోజకవర్గంలోని 25వ డివిజన్‌లో కేక్ కట్ చేశారు. 22వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బంకా శకుంతల, నాయకులు బంకా భాస్కర్, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. 15వ డివిజన్‌లో మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు నేతృత్వంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లు పంపిణీ చేశారు.



ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు లేకుండా చూడాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : జిల్లాలో ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని, ముఖ్యంగా రంగు మారిన ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్పందన నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ధాన్యం కొనుగోలుపై రైతులు స్పందనకు వచ్చి తమ సమస్యలు వివరించగా, ధాన్యం కొనుగోలు సమస్యలు ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తూ, రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. మాండూస్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రంగు మారిన, పాడైన ధాన్యం నిబంధనల మేరకు కొనుగోలుకు చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్ మాట్లాడుతూ బందరు మండలం కరగ్రహారం జగనన్న లేఅవుట్ మెరక పనులు వేగవంతం చేయాలని, అవసరమైతే అదనంగా ట్రాక్టర్లు పెట్టాలన్నారు. రోడ్ల నిర్మాణానికి గ్రావెల్ పనులు ఎంత వరకు చేశారో ఆరా తీశారు.జగనన్నకు చెబుదాం కార్యక్రమం కింద ముఖ్యమంత్రికి నేరుగా కాల్ చేసే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమం కింద సిటిజన్ గ్రీవెన్స్ నమోదు చేస్తున్నారని, వీటిని 24 గంటలలోగా పరిష్కరించాలని, వీటి పరిష్కారానికి కాల్ సెంటర్ నుండి చేసే కాల్స్కు అధికారులు సరిగా రెస్పాండ్ అవ్వాలన్నారు. డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, ముడా వీసీ బి. శివనారాయణరెడ్డి, ఆర్డీఓ ఐ.కిషోర్ స్పందనలో పాల్గొని కలెక్టర్ తో పాటు ప్రజల నుండి అర్జీలు స్వీకరించగా డ్వామా పీడీ జివి. సూర్యనారాయణ, సివిల్ సప్లైస్ డిఎం,

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

డాక్టర్ ఏ శ్రీధర్, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు కె. సరస్వతి ,డీఈవో తాహెరా సుల్తానా, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ ఈ ఎం వి ఎస్ రాజు, జెడ్ పి ఇంఛార్జి సి ఇ ఓ, జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-గుడివాడ : తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతిని ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాటు చేసినట్లు వెనిగండల్ల పౌండేషన్ అధినేత రాము తెలిపారు. సోమవారం అయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ స్థానిక వికేఆర్, విఎన్బి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 10వ తేది నుండి 13వ తేది వరకు సంక్రాంతి సంబారాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతకు జిల్లా పరిధిలో వాలీబాల్ టోర్నమెంట్, చిన్నారుల నుండి పెద్దల వరకు గ్రామీణ క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు పాల్గొని విజయవతం చేయాలని రాము కోరారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని వినతి

ప్రజాశక్తి నాగాయలంక : అవనిగడ్డ నియోజకవర్గం లో తడిచిన ధాన్యాని వెంటనే కొనుగోలు చేయాలనీ జాయింట్ కలెక్టర్ అపారజిత సింగ్కు మచిలీపట్నం కలెక్టరేట్లోని స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందించినట్లు కృష్ణ జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్య నారాయణ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్పంధిచి వెంటనే తడిచిన, మూతకామారిన దాన్యాన్ని కొని రైతులకి అండగా నిలవాలన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు బావిరెడ్డి వెంకటేశ్వరావు, మెండు లక్షణా రావు, తెలుగు రైతు సోషల్ మీడియా సమన్వయకర్త పామర్తి లక్ష్మణ్, తెలుగు రైతు ఉపాధ్యక్షులు వేముల శివాజీ పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు నగదు అందజేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

మండలంలోని కవుతరం గ్రామానికి చెందిన గోపిశెట్టి శ్రీమన్నారాయణ సోమవారం గుండెపోటుతో మరణించారు. సచివాలయం-1, పిఎసిఎస్ చైర్మన్ వడ్లమూడి నాగమోహన్ శ్రీమన్నారాయణ గహానికి వెళ్లి సంతాపం చేశారు. వైయస్సార్ బీమా వివరాలు సేకరించి తక్షణమే మతుడి భార్య దుర్గాంబికాకు పదివేల రూపాయలు అందజేశారు. తదుపరి బీమా క్లైమ్ సొమ్మును నెల రోజుల్లో అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవ స్వామి దేవస్థానం చైర్మన్ ఆరెపల్లి శీను, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ కష్ణ, డెక్క శ్రీనివాసరావు, వాలంటీర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : పేదలను ఆదుకోవడానికి చిరునవ్వుతో ఏపీలో సంక్షేమాభివద్ధి పాలనకు బీజం వేసిన నాయకుడు సీఎం జగన్ అని ఎంపీపీ సరోజిని అన్నారు. సోమవారం తేలప్రోలు గ్రామంలో జరిగిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. సీఎం విప్లవాత్మక సంస్కరణలతో చరిత్రను సష్టించి, సచివాలయ, వాలంటీర్ వ్యవస్థతో ప్రజల ఇంటి ముంగిటకు పాలనను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సీఎం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో

వృద్ధులను సన్మానిస్తున్న దృశ్యం

గ్రామ సర్పంచ్ లాం దిబోరా , ఉప సర్పంచ్ ఆదినారాయణ రెడ్డి, ఎంపీడీవో శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీ వి. కప కుమార్ పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే దిగజారుడు ఆరోపణలు

ప్రజాశక్తి కోడూరు : చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ కలిస్తేనే వైసీపీ నేతలకి వణుకు పడుతుందని కోడూరు మండల జనసేన పార్టీ నేతలు అన్నారు. సోమవారం కోడూరు మండల జనసేన పార్టీ కార్యాలయం వద్ద జనసేన నేతలు పాత్రికేయులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని పరామర్శించడానికి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ వెళితే దాన్ని కూడా వైసిపి నేతలు విమర్శించడం సిగ్గుచేటని అన్నారు. వాళ్ళిద్దరూ కలిస్తే వచ్చే ఎన్నికలలో వైసిపి తీవ్ర పరాజయం ఫాలు అవుతుందని ఓటమి భయంతో వైసిపి నేతల లకు వణుకు పుడుతుందని అందుకే ఇలాంటి దిగజారుడు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఈసమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు మర్రే గంగయ్య, పిట్టలంక గ్రామ సర్పంచ్ కనకాల వెంకటేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు కోట రాంబాబు, మండల పార్టీ ఉపాధ్యక్షులు జరుగు ఆదినారాయణరావు పాల్గొన్నారు.

ఘనంగా పద్మావతి మహిళా కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : స్థానిక పద్మావతి మహిళా హిందూ జూనియర్ కళాశాల 47వ వార్షికోత్సవం సోమవారం హిందూ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ పార్లమెంట్ సభ్యులు, హిందూ కళాశాల మేనేజ్మెంట్ అధ్యక్షులు కొణకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ సమాజంలో స్త్రీ విద్యకు ఎంతో ఉన్నతమైన స్థానం ఉందన్నారు. స్త్రీ చదువుకున్నదైతే కుటుంబ యావత్తు అన్ని రంగాల్లో ముందుంటుందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో స్త్రీలు ఎన్నో రంగాల్లో ముందుకు వెళ్తున్నారని దానికి చదివే ఒక మార్గమన్నారు. అనంతరం జరిగిన సాంస్కతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు దేశభక్తి గీతాలు, నాటికలు, కథనాలు, రకరకాల నత్యాలు కళాశాల విద్యార్థినులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ దైతా గోపాల శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల సంబరాలు

గుడివాడ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి నిర్వహించిన మహాప్రస్థానం పాదయాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక శరత్దియోటర్లోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకులు వేడుకలు నిర్వహించారు. పట్టణ వైఎస్ఆర్సిపి పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ అభివద్ధి కమిటీ చైర్మన్ ఎం.వి నారాయణరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించి, మహాప్రస్థానం విజయోత్సవ కేక్ కట్ చేశారు. మాజీ కౌన్సిలర్ మాదాసు వెంకటలక్ష్మి, నాయకులు కొంకితల అంజనేయప్రసాద్, వెంపంటి సైమన్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** బంటుమిల్లి లక్ష్మీపురం సెంటర్లో స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహనికి పూలమాలలు వేసి స్వీట్లు పంపినీ చేశారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి మండల పార్టీ అధ్యక్షులు శ్రీ మలిశెట్టి రాజబాబు, ఎంపీపీ వెలివెల చినబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ బాబురావు, ఎంపీటీసీ కమల్ భాష ,తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : సింహాద్రి

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర ప్రజల అభివద్ధికి సంక్షేమానికి కషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి తిరిగి మరోసారి పట్టం కట్టాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు కోరారు. సోమవారం అవనిగడ్డలోని ఐదవ సచివాలయం పరిధిలోని మండలిపురం సింహాద్రి కాలనీ వైశ్య కాలనీ మండలి నగర్లో పార్టీ యువ నేత సింహాద్రి వికాస్ తో కలిసి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ సీఎం అమలు చేస్తున్న సంక్షేమ అభివద్ధి కార్యక్రమాలను లబ్ధిదారులకు వివరించారు. ముఖ్యమంత్రి చేపట్టిన నాడు నేడు రైతు భరోసా కేంద్రాలు సచివాలయాలు వాలంటీర్ వ్యవస్థ ఆరోగ్యశ్రీ జగనన్న కాలనీ వంటి కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గో రుముచ్చు ఉమా, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి గూడూరు :** రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం విప్లవాత్మకమైన ఆదర్శ సంక్షేమ పాలన అందిస్తుందని రాష్ట్ర గహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గూడూరు మండల పరిధిలో కప్పలదొడ్డి గ్రామంలో సోమవారం మంత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందజేస్తున్న అభివద్ధి,సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజలు పొందిన లబ్ధి వివరాలతో కూడిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంతకం చేసిన కరపత్రాలను అందజేశారు. కులమతాలు, రాజకీయాల కతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. కప్పలదొడ్డి గ్రామ సర్పంచ్ యక్కల మాధవి నాగరాజు, గూడూరు ఎంపీపీ సంగా మధుసూదన రావు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు గోరిపర్తి రవి తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో కౌలు రైతు మృతి

ప్రజాశక్తి -పెదపారుపూడి : పాము కాటుకు గురై కౌలు రైతు మతి చెందిన సంఘటన మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం వెంట్రప్రగడ గ్రామానికి చెందిన కౌలు రైతు మసిముక్కు రాధాకష్ణ (38) సోమవారం కౌలు చేస్తున్న పొలంలో పురుగుల మందు పిచికారీ చేస్తున్న

సమయంలో పాము కరిచింది. వెంటనే రాధాకష్ణను గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కుటుంబ సభ్యులు తరలించారు. వైద్యులు పాము కాటు విరుగుడుకు ఇంజక్షన్లు చేసి మెరుగైన వైద్యం కోసం గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మతి చెందాడు. మతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు .దీనిపై గుడివాడ ఔట్లెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ప్రభుత్వం నుండి నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు

గుండెపోటుతో కొంగంచర్ల సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-పెడన : మండలంలోని కొంగంచర్ల సర్పంచ్ లోయ రాజేశ్వరి ఆదివారం రాత్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. సర్పంచ్ మరణ వార్త తెలుసుకున్న మంత్రి జోగి రమేష్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

రాజేశ్వరి పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. పార్టీ పటిష్టత కోసం చిత్తశుద్ధితో పని చేసే లోయ రాజేశ్వరి ఇక లేరనే దుర్వార్త తెలుసుకొని తాను ఎంతో కలత చెందానని మంత్రి భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం సర్పంచ్ లోయ రాజేశ్వరి కుమారుడు పెడన మండల వై.యస్.ఆర్.సీ.పీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోయ ఆంజనేయులుని మంత్రి జోగి రమేష్ వారి మాతమూర్తి మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

అభినందనీయుడు కాట్రగడ్డ శ్రీనివాస్

ప్రజాశక్తి-చల్లపల్లి : దేశ విదేశాల్లో డప్పు ప్రదర్శనలు ఇచ్చి చల్లపల్లికి ఖ్యాతి తెచ్చిన చాట్రగడ్డ శ్రీనివాసుడు అభినందనీయులు అని చల్లపల్లి ఎస్.ఆర్.వై.ఎస్.పి జూనియర్ కాలేజీ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. అద్భుతమైన డప్పు కళను ప్రదర్శించి ఇటీవల ఆంధ్రప్రదేశ్ సాంస్కతిక శాఖ నుండి రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి పొందిన చాట్ర గడ్డ శ్రీనివాసుడుకు ఆదివారం సాయంత్రం కళాశాలలో ఘనంగా సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ పెద్దలు మండవ బాలవర్థి, అరజా రాజేంద్రప్రసాద్, మోర్ల రాంబాబు, కోనేరు బలరాం, కోళ్ల శేఖర్ బాబు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిపై సమావేశం

ప్రజాశక్తి-పమిడిముక్కల : ప్రస్తుత విద్యా సంవత్సరానికి గాను ఇయర్ప్లాన్ అభివద్ధి, ప్రణాళిక తయారు చేస్తున్నట్లు పమిడిముక్కల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవ నారాయణ అన్నారు. సోమవారం పమిడి ముక్కల మండలం లోని మండల

వనాల కేంద్రంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొని ఇయర్ ప్లాన్పై చర్చించారు. ఈ కార్యక్రమంలో అగినపర్రు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరాజ్యలక్ష్మి, హనుమంతపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, కష్ణాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవరపల్లి కోటయ్య, కపిలేశ్వరపురం సిఆర్పి రవితేజ,వీరంకి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాయత్రి దేవి తదితరులు పాల్గొన్నారు.

నేటి తరానికి ఆదర్శం రావూరి అర్జున్‌రావు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్

సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు, నాస్తికుడు, హేతువాది మానవతావాది, రావూరి అర్జున్‌రావు నేటి తరానికి ఆదర్శ ప్రాయంగా నిలుస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారి అజయ్ కల్లం అన్నారు. రావూరి అర్జున్‌రావు సంస్మరణ సభ సోమవారం బెంజ్‌సర్కిల్ వద్ద గల వేదిక ఫన్‌క్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మగాంధీ, గోరా సిద్ధాంతాలకు ఆకర్షితులై తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన మహోన్నత వ్యక్తి రావూరి అర్జున్‌రావు అని కొనియాడారు. నాస్తిక జీవన విధానంలో పయనిస్తూ సమాజంలో కులమతాల అసమానతలను రూపుమాపటంలో రావూరి రాజీలేని పోరాటం చేశారన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, సంస్కరణలకు మారు పేరైన అర్జున్‌రావు నేటి తరానికి ఆదర్శప్రాయంగా నిలుస్తారన్నారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా మారుమూలల గ్రామంలో నాస్తిక కేంద్రాన్ని స్థాపించి కుల మత వర్గ బేధాలు అంటరాని తరం మూఢ విశ్వాసాలు, దురాచారాలపై ఉక్కుపాదం మోపి పోరాటం చేస్తున్న గోరా, సరస్వతి గోరా దంపతులకు బాటలో పయనించి వారి ఆశ్రయాలను భాగస్వాములు కావడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనం అన్నారు. ప్రభుత్వ సలహాదారి జివిడి కృష్ణమోహన్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు సమానమేనని, ప్రకృతి అందించే వనరులు అందరికి సమానంగా అందించాలనే భావం రావూరి మనస్సులో బలంగా వుండేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణువర్ధన్, సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు, ప్రముఖ వైద్యులు జి.సమరం, మార్పు ట్రస్ట్ డైరెక్టర్ రావూరి సూయజ్, ఏలూరు సెయింట్ థెరిస్సా కళాశాల ఫుడ్ అండ్ న్యూట్రిషినిస్ట్ హెచ్‌వోడి పద్మజ, రావూరి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్జున్‌రావు సంస్మరణ సభలో మాట్లాడుతున్న అజయ్ కల్లం

శ్రీ చైతన్యలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన ముగ్గులు, రైతు వేషధారణలు, పల్లెటూరి ఆడపడుచుల వేషధారణలతో పాఠశాల ప్రాంగణం కనుల విందుగా మారింది. విద్యార్థులకు జరిగిన పోటీలలో భాగంగా పలు సాంస్కృతిక క్రీడలు అందరినీ ఆకర్షించాయి. వీటితోపాటు జోడి కాంటెస్ట్, రంగవల్లిక పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే లావణ్య మాట్లాడుతూ సంక్రాంతి పండుగ రైతుల పండుగని, రైతు విశిష్టతను సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను నేటి తరం పిల్లలకు తెలియజేయుట కోసం ఇంత ఘనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. తరువాత వివిధ విభాగాలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ వినోద్, పాఠశాల డీన్ వంగూరి కృష్ణ పాల్గొన్నారు.

విశ్వభారతి విద్యార్థుల ఎన్ఎస్ఎస్ క్యాంపు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని విశ్వ భారతి జూనియర్ మరియు డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో సోమవారం స్పెషల్ క్యాంపు మండలంలోని చిల్లకల్లు గ్రామం నందు ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో జగ్గయ్యపేట తహసిల్దార్ కె నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి, విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనటం అభినందనీయమని, జగ్గయ్యపేట ప్రాంత విద్యార్థులు చదువు బాగా చదువుకొని గ్రూప్ వన్ సర్వీసెస్ లో ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావాలని కోరారు. మొదటిరోజు మండల పరిషత్ కార్యాలయం పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో విశ్వ భారతి విద్యా సంస్థల కరస్పాండెంట్ కే పద్మ శేఖర్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జల్లా తిరుపతిరావు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు తిరుపతిరావు, శ్రీమతి సవిత, ప్రైవేట్ స్కూల్స్ జగ్గయ్యపేట డివిజన్ అధ్యక్షులు కోమరగిరి భరద్వాజ పాల్గొన్నారు. మొదటి రోజు ఎండిఓ ఆఫీస్ పరిసరాలను శుభ్రం చేశారు.

370 కోడి కత్తులు స్వాధీనం

ప్రజాశక్తి-మైలవరం: మండలం స్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి జూదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు మైలవరం ఏసిపి ఎం రమేష్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ మైలవరం హాజీపేటలో మాగిశెట్టి రామకష్ణ వద్ద నుంచి 370 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు.మైలవరం డివిజన్లో కోడిపందాలు పేకాట ఆడే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు.జూదాల వైపు వెళ్లకుండా ప్రజల దష్టిని మళ్లించేందుకు సంక్రాంతి పండుగ సందర్భంగా క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు.గ్రామాల్లో ప్రజాప్రతినిధుల ద్వారా జూదాలపై ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ రమేష్, ఎస్ఐ రాంబాబు పాల్గొన్నారు.

వైసిపి పాలనకు చరమగీతం పాడాలి : సౌమ్య

ప్రజాశక్తి-కంచికచర్ల: రాబోయే ఎన్నికల్లో వైసిపికి పాలనకు చరమగీతం పాడాలని నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ కాలనీలో సోమవారం రాత్రి ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి పాలనలో నిత్యావసరాలు, పన్నులు, విద్యుత్ ఛార్జీలతో సామాన్యుల బతుకులు దుర్భరంగా మారాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, నాయకులు గుర్రం రామకృష్ణ, గుత్తా రత్నం, వేమా వెంకట్రావు, మాజీ ఎంపీటీసీ రొంపిచర్ల శ్యాము తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలి : కృష్ణయ్య

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: పార్లమెంటు సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలని, ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం ఎ.కాలనీలో సోమవారం జరిగిన విద్యుత్ బీసి ఉద్యోగుల రాష్ట్ర మహాసభకు సంఘం అధ్యక్షులు వీరభద్రయ్య, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ బీసిల ఉద్యమానికి బిసి ఉద్యోగులు నాయకత్వం వహించాలన్నారు. దేశ జనాభాలో 56శాతం ఉన్న బిసిలు కులాల పేరు మీద విడిపోవడం వల్ల న్యాయమైన డిమాండ్లు సాధించలేకపోతున్నారు. బిసి కోటా క్రింద ఉద్యోగాలు వచినందున ఆయా కులాల అభివృద్ధి కోసం పోరాడే సాంఘిక బాధ్యత భుజాన వేసుకోవాలని పిలుపునిచ్చారన్నారు. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడానికి న్యాయపరమైన అడ్డంకులు ఏమీలేవన్నారు. మండల కమిషన్ సిఫార్సు ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలలో 27శాతం బిసి రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన 28 సంవత్సరాల తరువాత కూడా బిసి ఉద్యోగుల శాతం పెరుగకపోవడం శోచనీయమన్నారు. విద్య, ఉద్యోగ నియామకాలలో బిసి రిజర్వేషన్లపై క్రిమిలేయర్ నిబంధన విధించిన తీరు బిసిలపై చిన్నచూపు చూస్తున్నట్లు స్పష్టంగా కన్పిస్తుందన్నారు. విద్యుత్ సంస్థలతో పాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసే ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి-భవానీపురం: పిచ్చికుక్క దాడి చేయడంతో పలువురు వ్యక్తులకు గాయాలపాలైన సంఘటన పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతంలో చోటుచేసుకంది. సోమవారం ఉదయం 45వ డివిజన్‌లోని రాము క్వారీ వద్ద ఒక పిచ్చి కుక్క పలువురు వ్యక్తులపై దాడి చేసి కరచి గాయపరిచింది .స్థానిక సోషల్ వర్కర్ డి.రాము, స్థానికులు ఇజ్రాయిల్, శ్రీనులతో పాటు మరికొందరిని కూడా పిచ్చికుక్క కరవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. పిచ్చికుక్క కరిచిన విషయాన్ని కబేళా వెటర్నరీ సర్జన్ రవిచంద్రకు సోషల్ వర్కర్ రాము తెలియజేసి ఈ ప్రాంతంలో కుక్కలు బాగా ఎక్కువగా ఉన్నందున వాటిని పట్టుకుని దూరంగా తరలించాలని కోరారు. అలాగే పిచ్చికుక్క కరిసిన వారిని కొత్తపేటలోని షేక్ రాజా హాస్పిటల్ వెళ్లి యాంటీ రాబిస్ ఇంజక్షన్లు చేయించుకోవాలని సూచించారు. కాగా రాము క్వారీ ప్రాంతంలో కుక్కలు ఎక్కువగా ఉండి ప్రజలను కరుస్తున్నాయని, వాటి నుండి కాపాడాలని స్థానికులు నగరపాలక సంస్థ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాల సేకరణలో విజయ డెయిరీదే అగ్రస్థానం

ప్రజాశక్తి-తిరువూరు: దేశంలో అత్యధిక పాల సేకరణ చేస్తూ లీటర్ 78 రూపాయలకు ఇచ్చేది విజయ పాల డెయిరీ మాత్రమేనని కష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. పాడి రైతు సంక్షేమం మన మతం – అలుపెరగని సేవ మన అభిమతం అనే కార్యక్రమంలో భాగంగా తిరువూరు క్లస్టర్ పరిధిలోని కాకర్ల పాల సొసైటీని అయన సోమవారం సందర్శించారు. అనంతరం పాల సొసైటీ అధ్యక్షుల, పాలకవర్గ సభ్యులు, పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక ధరతో పాటు సంవత్సరానికి నాలుగు నెలలకొక్కసారి 15శాతం ధర వ్యత్యాసం, బోనస్ చెల్లింపులు చేస్తున్నామన్నారు. కల్యాణమస్తు పథకం ద్వారా రూ.20 వేల విలువైన బంగారు నాణెం, క్షీర బంధు పథకం ద్వారా మరణించిన పాడి రైతుకు రూ.50 వేలు ఆర్థిక సహాయం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా పాలకవర్గ సభ్యులు బోయపాటి సుశీల, జిల్లా ట్రస్ట్ సభ్యులు పల్నాటి సత్యనారాయణ, మేనేజర్ టి.సాంబశివమూర్తి, సంఘ అధ్యక్షులు సగుర్తి శేషగిరిరావు పాల్గొన్నారు.

అల్లరి మూకల ఆట కట్టించాలి : ఐద్వా

సిఐ సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-వన్‌టౌన్: మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవించి విద్యార్థులను, మహిళలను వేధించే అల్లరి మూకల ఆటలు కట్టించాలని ఐద్వా పశ్చిమ సిటీ అధ్యక్ష కార్యదర్శులు కుండనాల శేషమణి, గాదె పాలవల్లి తెలిపారు. సోమవారం టూటౌన్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సిఐలు సుబ్రహ్మణ్యం, సురేష్ రెడ్డిలకు ఐద్వా ఆధ్వర్యంలో మహిళలకు, విద్యార్థులకు రక్షణ కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు రోడ్డు పొట్టి శ్రీరాములు కాలేజీ ఎదురు అలాగే నైజాం గేటు, స్కూల్స్, కాలేజీలు మొదలగు ప్రాంతాలలో మద్యం, గంజాయి సేవించే అల్లరి మూకలు గ్రూపులుగా ఆటోలో కూర్చుని దారిలో పోయే మహిళల్ని స్కూల్ పిల్లలను అసభ్య పదజాలాలతో వేధిస్తూ అడ్రస్‌లు, ఫోన్ నెంబర్లు ఇవ్వమని వెంటపడుతున్నారని తెలిపారు. స్కూల్‌లో స్టడీ అవర్స్ పూర్తయ్యేసరికి చీకటి పడుతుండటంతో ఆడపిల్లలు ఇళ్లకు రావాలంటే భయపడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవించి రాత్రి ఒంటిగంట వరకు ఏరియాలో అరాచకాలు సృష్టిస్తున్నారని, అలాగే వన్‌టౌన్ బ్రాహ్మణ వీధి అడ్డరోడ్డు ఉప్పర వాగు సెంటర్ వంటి ఏరియాల్లో కూడా ఎక్కువైపోతున్నారని, అదేమని అడిగిన వారిపై దాడులు చేస్తున్నారని, వారి ఆగడాలకు అడ్డుకట్ట వేసే విధంగా అవసరమైన చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి మహిళలకు, విద్యార్థులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఆఫీస్ బేరర్స్ విక్రం లక్ష్మీ, కె, ఉష, ఎస్కె పాకిర, దుర్గ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఎర్రకట్ట రోడ్డు బాగు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-వన్‌టౌన్: విజయవాడ ఎర్రకట్ట రోడ్డు బాగు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. సోమవారం ఎర్రకట్ట రోడ్డుపై రోడ్లను మర్మమత్తులు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రకట్ట రోడ్డు గుంతలతో తరుచూ రోడ్డు ప్రమాదాలకు గురై వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చిట్టినగర్ దగ్గర నుండి కేదారజేశ్వరపేట వరకు ఈ ఎర్రకట్ట రోడ్డు గంతులమయమైందని తెలిపారు. అనేక ప్రమాదాలు జరుగుతున్న స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించడం లేదని తెలిపారు. వెంటనే ఎర్రకట్ట రోడ్డు మరమ్మత్తులు చేయాలని లేకపోతే రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఆందోళనకు సీపీఐ సిద్ధం అవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లంక దుర్గారావు, బుట్టి రాయప్ప, తాడి పైడియ్య, పంచదార్ల దుర్గాంబ, డీవీ.రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) సంక్రాంతి పండుగను సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని, కోడి పందేలు, జూదక్రీడలు నిర్వహించే వారిపట్ల కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. సోమవారం తన చాంబర్ లో సంక్రాంతి పండుగ సందర్భంగా చట్టవిరుద్ధంగా నిర్వహించే కోడి పందేలు, జూద క్రీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన జిల్లా ఎస్పీ పి. జాషువాతో కలసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోడి పందేలు, జూద క్రీడలు నిర్వహించకుండా డివిజన్, మండల, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. కోడి పందేలు నిర్వహించుట, పాల్గొనుట చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై సెక్షన్ 10 ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ 1974, సెక్షన్ 34 జంతుహింస నివారణా చట్టం 1960 ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, గతంలో కోడి పందేలు నిర్వహించే వారిని, కత్తులు కట్టే వారిపై బైండోవర్ కేసులు నమోను చేయాలని ఆయన అధికారులకు సూచించారు. కోడి పందేలు జరుగుతున్నా యన్న సమాచారం అందిన వెంటనే అక్కడకు వెళ్లి బరిలను ధ్వంసం చేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కోడిపందేలు నిర్వహిం చుట, పాల్గొనుట చట్టరీత్యా నేరం పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, బందరు డిఎస్పీ మాసూం బాషా, జడ్ పి సిఇఓ శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ జేడి కె.చంద్ర శేఖర్, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ల ఆర్డీఓలు ఐ. కిషోర్, పి.పద్మావతి, విజయ్ కుమార్, డిఎల్ ఒ డి.సుబ్బారావు, స్థానిక గోసాల నిర్వాహకులు పల్లబోతు సుబ్రహమణ్యం, మున్సిపల్ కమీషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

నేటి నుంచి అందుబాట్లోకి ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ '1967' : జెసి

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : ఈ నెల 10వ తేదీ నుండి ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ నెంబర్ 1967 రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు అందుబాటులోకి వస్తుందని జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020 జూలై, 20 నుండి అమలులోకి వచ్చిన వినియోగదారుల రక్షణ చట్టం 2019 ప్రకారం వినియోగదారులకు హక్కులను కల్పిస్తూ వారిలో బాధ్యతా మరియు చైతన్యం తీసుకురావడం కోసం అనేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ రాష్ట్ర కార్యాలయం నందు ప్రజలు, వినియోగదారులు మరియు ధాన్యం కొనుగోలు సంబంధిత సమస్యల పరిష్కారం చూపుటకు గాను ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివిధ టోల్ ఫ్రీ నెంబర్లు 2008 1967 (పౌర సరఫరాలశాఖ) 18004253545 (ఒకే దేశం ఒకే రేషన్కార్డు) 1800 425 2388/ 155235 రాష్ట్ర ఆహార కమీషన్) 180042540 (తూనికలు కొలతల శాఖ) పై తెలిపిన అన్ని టోల్ ఫ్రీ నెంబర్లను 1967 ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ నెంబర్ గా అనుసంధానం చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రజలు, వినియోగదారులు ఈ కాల్ సెంటర్ నెంబరుకు ఫోన్ చేసి ప్రజాపంపిణీ వ్యవస్థ, ధాన్యం సేకరణ, గ్యాస్ సిలిండర్, పెట్రోల్ బంకులు, తూనికలు కొలతలు, బియ్యం కార్డు సేవలు తదితర సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు. ప్రతి రోజు ఆఫీసు పనివేళల్లో ఉ.10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అందబాటులోకి వస్తున్నదని కావున ప్రజలందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు.

లంక భూముల్లో ఇసుక తవ్వకాలు అడ్డగింత

ప్రజాశక్తి-చల్లపల్లి : నది పరివాహ ప్రాంతాల్లో లంక భూముల్లో ఇసుక తవ్వకాలు చేపడితే ఊరికినే లేదని దళిత రైతులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. చల్లపల్లి మండలం వెలివోలు లంకలో సోమవారం నదీ పరివాహక ప్రాంత లంక భూముల్లో ఇసుక తవ్వకానికి రంగం సిద్ధం చేయడంతో రైతుల అడ్డుకొని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో టిప్పర్లను, ప్రోక్లైన్లను ఎందుకు తీసుకొ చ్చారని ప్రశ్నించారు. అక్రమంగా అనుమతి లేకుండా తవ్వకాలు చదివితే సహించేది లేదని హెచ్చరించారు. లంక భూములలో ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలు అంతరించిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇక్కడ ప్రారంభించిన ఇసుక త్రవ్వకలను రైతులు ఎదిరించటంతో ఆపేశారు. వెలివోలు లంక భూముల్లో దళిత రైతులు పంటలు పండించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇక్కడ ఇసుక తవ్వకాలు చేపడితే పంటలకు నీరు అందక పొలాలు వీడుగా మారిపోయే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. తమది రైతు సంక్షేమ ప్రభుత్వం అన్ని విధాల రైతులను ఆదుకుంటాం అని చెబుతున్న పాలకులు దళిత దళిత భూములను పక్క ఇసుక తవ్వకాలకు అనుమతి ఎలా ఇచ్చారని అధికారులపై మండిపడుతున్నారు. ప్రభుత్వ అధికారులు అనుమతి ఉంటే ఇసుక తవ్వకానికి రాత్రులు రావాల్సిన పని ఏంటి అని నిర్వాహకులను నిలదీశారు.

యుక్తను అభినందిస్తున్న శ్రీనివాసరావు

కూచిపూడి నృత్యంలో 'యుక్త'కు రాష్ట్రస్థాయి పురస్కారం

ప్రజాశక్తి-గన్నవరం : భారత్ ఆర్ట్స్ అకాడమి,ఎబిసి ఫౌండేషన్ సంయుక్తంగా ఈ నెల 8 వ తేదీన రాజమహేంద్రవరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సంక్రాంతి నంది పురస్కారాల లో గన్నవరం వి. కే.ఆర్ కళాశాలకు చెందిన గుళ్ళపల్లి యుక్త కూచిపూడి నత్యంలో విశేష ప్రతిభ కనపరచి నంది పురస్కారం సొంతం చేసుకోవడం సంతోషించ దగ్గ విషయమని కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కళాశాలో జరిగిన యుక్త అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిగత స్కిల్ పోటీల్లోనూ, సాంస్కతిక రంగాలలో రాణించేలాగా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు . యుక్త గత మూడుసంవత్సరాలుగా రాష్ట్ర స్థాయిలో జరిగే కూచిపూడి నత్య ప్రదర్శనలో ప్రతిభ ప్రదర్శించడం ద్వారా పలు అవార్డులు సొంతం చేసుకోవటం కళాశాల ప్రతిష్టను పెంచుతున్నదన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు , నవీన్ కుమార్ , జాషువా , విజయక్కుర్ . దుర్గాభవాని , తీజ , వినీల కష్ణ , తదితరులు పాల్గొన్నారు.

నంది వాహనం బహూకరణ

ప్రజాశక్తి-ఉయ్యూరు : పట్టణంలోని శ్రీ జగదాంబ సమేత సోమేశ్వర స్వామి వారి దేవస్థానానికి ఉయ్యూరు నగర పంచాయతీ చైర్మన్ వల్లభనేని సత్య నారాయణ(నాని) సోమవారం లక్ష రూపాయలకు పైగా విలువ గల నంది వాహనాన్ని సమర్పించారు. సోమ వారం అర్చకులు చేత పూజలు నిర్వహించి మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని భార్గవి దంపతులు ఆలయానికి నంది వాహనాన్ని అందచేశారు. కార్యక్రమంలో శివాలయం చైర్మన్ సిహెచ్ వి.వి. కుటుంబరాజు , 9 వ వార్డు కౌన్సిలర్ ఊర శ్రీవాణి, వైఎస్ఆర్సిపి వాణిజ్య విభాగం నాయకులు వెంట్రప్రగడ బాబ్జి పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి ఉపప్రణాళిక చట్టం అమలు కాలపరిమితి పెంచాలి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు లాం తాంతీయాకుమారి

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా)

ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక చట్టం - 2013 అమలు కొనసాగించాలని మరియు కాలపరిమితి పెంచాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ కష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షురాలు ,లాము తంతీయా కుమారి సోమవారం జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్టీ సబ్-ప్రణాళిక 10 సంవత్సరముల కాల పరిమితి 2023 మార్చితో ముగియనున్నదని, .కావున దీనిని మరో 10 సంవత్సరములు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సబ్-ప్లాన్ అమలు కొరకు ప్రత్యేక యత్రాంగాన్ని నియమించెలా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో అమలు చేస్తున్న 27 ఎస్సీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం రద్దుచేయడం వల్ల రాష్ట్రంలో దళితుల అభివద్ది కుంటుపడిందని కాబట్టి వాటిని వెంటనే తిరిగి పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బందరు పట్టణాధ్యక్షులు కొండమంచిలి చంద్ర శేఖర్. బందరు మాజీ ప్రెసిడెంట్ మొహ్మద్ దాదా, జిల్లా మైనారిటీ ఉపాధ్యాక్షులు మొహమ్మద్ ఫిరోజ్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు షేక్ చానుభాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వృత్తి విద్యా కోర్సు సర్టిఫికెట్ల అందజేత

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

ఇంటర్మీడి యట్ వత్తి విద్య కోర్సులు చదివిన విద్యార్థినులకు ఉద్యోగ అవకాశాలు ప్రభుత్వపరంగా అందుబాటులో ఉన్నాయని మచిలీపట్నం వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమిషనర్ వెంకటేశ్వరరావు అన్నారు. కళాశాల విద్యార్థునీలు గత నెల రోజులుగా వాణిజ్య పనుల కార్యాలయంలో ఉపాధి శిక్షణ పొందుతూ సోమవారం ఏర్పాటుచేసిన ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. వత్తి విద్యా కోర్సులు చదవటం వల్ల విద్యార్థునీలు చిన్న వయసులోనే ఆర్థికంగా సంపాదించుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి వారికి వెంకటేశ్వరరావు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శాంబశివరావు, అసిస్టెంట్ కమిషనర్ భార్గవి కళాశాల అధ్యాపకులు లంకిశెట్టి హరనాథ్ బాబు, మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

జిఓ నెంబర్ 1 రద్దు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-బంటుమిల్లి : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ వన్ రద్దు చేయాలని కోరుతూ గుండా బత్తుల ఆంజనేయులు స్మారక భవనంలో అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈకార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, సిపిఎం పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి టిడిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి బొల్లా వెంకన్న మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ పరిపాలన జరుగుతుందని, ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చ తీసుకొచ్చే విధంగా జీవో నెంబర్ ఒకటిని తీసుకొచ్చారని అన్నారు. సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు పరుచూరి ధనశ్రీ మాట్లాడుతూ వైయస్సార్ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థకే మచ్చ తెచ్చిందని నిరసన తెలియజేసే తెలియజేసే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎక్స్ ఎంపీటీసీ జొన్నలగడ్డ కొండ, జనసేన పార్టీ మండల అధ్యక్షులు ర్యాలీ సత్యనారాయణ, బొల్లా వెంకన్న, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మాజేటి శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు బొడ్డు నాగరాజు, వంగల రాజు పొదిలి వెంకన్న తదితరులు పాల్గొన్నారు

కొనసాగుతున్న రీ సర్వే

ప్రజాశక్తి -మొవ్వ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన భూముల రీసర్వే మొవ్వ మండలంలో శరవేగంగా కొనసాగుతుంది. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు -భూరక్ష పదకంలో బాగంగా మీ భూమి - మా హమి కార్యక్రమంతో చేపట్టిన భూముల రీసర్వే తొలివిడతగా మండలంలోని ఆరు గ్రామాలలో ప్రారంబించారు. మండలంలోని బార్లపూడి ,ఆవిరి పూడి గ్రామాలలో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తికాగా అయ్యంకి, చినముత్తేవి ,పెడసనగల్లు ,పెదముత్తేవి గ్రామాల గ్రౌండ్ ట్రూతింగ్ కొనసాగుతుంది.తహశీల్దారు సిహెచ్ ఆంజనేయ ప్రసాద్ , రీసర్వే డిప్యూటీ తహశీల్దారు కే.శ్రీనివాసరావుల పర్య వేక్షణలో మండల సర్వేయర్ అనపర్తి కిషోర్ ఆధ్వర్యంలో మొవ్వ మండల సచివాలయ సర్వేయర్లతో పాటు చల్లపల్లి మండలానికి చెందిన మరికొందరు గ్రామ సచివాలయ సర్వేయర్లను డిప్యుటేషన్

హాస్టల్‌ను ప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్ వెంటనే ప్రారంభించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం స్పందనలో అధికారులకు అర్జీ ఇచ్చారు. గన్నవరంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నలుమూలల నుండి వచ్చి చదువుతున్న విద్యార్థులకు హాస్టల్ వసతి సమస్య తీవ్రంగా ఉందని వీరి కోసం నిర్మించిన హాస్టల్ పూర్తి అయి దాదాపు మూడు సంవత్సరాలు అవుతుందనీ, కానీ ఇప్పటివరకు హాస్టల్ ని ప్రారంభించలేదన్నారు. పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రస్తుతం ప్రభుత్వ స్కూలు హాస్టల్లో ఉంటూ కళాశాలకు వెళ్తున్నారన్నారు. ఆస్కూల్ హాస్టల్ వాళ్ళు కూడా హాస్టల్ ఖాళీ చేయమని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నరన్నారని, దీనితో విద్యార్థులు వసతి ప్రశ్నర్ధకంగా మారిందన్నారు. కావున ఇప్పటికే పూర్తి అయిన కళాశాల హాస్టల్ ను తక్ష ణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అర్జీ ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ గన్నవరం నియోజకవర్గ కార్యదర్శి రాజేష్, మచిలీపట్నం నాయకులు కీర్తి, అజమ్ పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీ విసిగా రామమోహన రావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్ : కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్సులర్‌గా ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్, విశ్రాంత కామర్స్ ప్రొఫెసర్, ఎపి ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్, విద్యామండలిలో క్వాలిటీ అస్యురెన్స్ సెల్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.రామ మోహన రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా రోజువారీగా తరగతుల నిర్వహణ, పరిశోధన, వర్సిటీలో వేలంగా మౌలిక సదుపాయాల కల్పన ప్రథమ ప్రాధాన్యతలుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ డి.సూర్య చంద్రరావు, రిజిస్ట్రార్ ఎం.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వర్సిటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

అసమ్మతులకు బుజ్జగింపులు ?

మిగతా అసమ్మతి నేతలతో సమాలోచనలు జరిపి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటానని ఆ అసమ్మతి నేత తన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అలాగే కంచికచర్ల మండలం గొట్టుముక్కలలో నేతల మధ్య సయోధ్య లేదు. దీనికితోడు పార్టీ ఆవిర్భావం నుండి ఉన్న నాయకులను కాదని కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి ప్రాధాన్యత పెరగటంతో ఈ గ్రామంలో వైసిపి పూర్తిగా పట్టు కోల్పోయినట్లు ఆ పార్టీ కార్యకర్తలే చెబుతున్నారు. గని ఆత్కూరు, కొత్తపేటలో అసమ్మతి ఎక్కువగా ఉంది. కొత్తపేటకు చెందిన ఓ నాయకుడు సచివాలయాలు, ఇతర అభివద్ధి పనులకు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తే, ఇప్పటి వరకు బిల్లులు రాకపోవటంతో అప్పులపాలయ్యాడు. దీంతో కొద్ది నెలలుగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనటం లేదు. కంచికచర్ల మేజర పంచాయతీలో డజను మందికిపైగా నేతలు ఉన్నారు. 2019 ఎన్నికల్లో ఇంటింటికీ తిరిగి ఓట్లు వేయించిన నాయకులకు సరైన పదవులు రాలేదు. దీంతో ఉన్న నాయకులంతా ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలు మీద వేసుకుని చేసే నాయకుడికి కూడా సరైన గుర్తింపు ఇవ్వలేదనే ప్రచారం ఉంది. కీసర గ్రామంలో ఇప్పటికే కొందరు నాయకులు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వీరులపాడు మండలంలో 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉండి సర్పంచ్‌గా, మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా పదవులు అలంకరించిన సీనియర్ నాయకుడికి కూడా గుర్తింపు లేకుండా పోయినట్లు తెలిసింది. నరశింహారావుపాలెం గ్రామానికి 40 ఏళ్లకుపైగా ఆయన సర్పంచ్‌గా ఉన్నారు. అలాంటి నాయకుడికి పోటీగా ఇతరులను ప్రోత్సహిస్తుండటంతో ఆయన అసమ్మతి నేతగా ఉన్నారు. తన అనుచరులతో కలిసి ఆయన ఏదో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటున్నారు. జుజ్జూరు గ్రామంలోనూ నేతల పరిస్థితి అలాగే ఉంది. మండల కేంద్రమైన వీరులపాడు చెందిన నేతలు ఈసారి వైసిపి ఓటమే ధ్యేయంగా పావులు కదుపుతున్నారు. మండల కేంద్రాన్ని జుజ్జూరుకు మార్పుచేస్తూ మంత్రివర్గంలో తీర్మానిండాన్ని వారు తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఇప్పటికే ఆ గ్రామంలో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా రిలే దీక్షలు కొనసాగిస్తున్నారు. ఇకపోతే నందిగామలో ఇటీవల కాలంలో నరమనేని మురళి, కన్నెగంటి జీవరత్నం లాంటి సీనియర్ నాయకులు వైసిపిని వీడారు. గత ఎన్నికల ముందు టిడిపి నుండి వైసిపిలోకి వచ్చిన వారు ఎంఎల్ఎ గెలుపునకు కషి చేశారు. అయితే అధినాయకత్వంపై అసమ్మతి వ్యక్తం చేస్తూ ఇటీవల పార్టీకి రాజీనామా చేశారు. వీరు పార్టీని వీడగానే అధినాయకత్వంతోపాటు ద్వితీయ శ్రేణి నేతలు కూడా ఈ ఇద్దరిపై లేనిపోని ఆరోపణలు చేయడంతోపాటు అవాకులు చవాకులు పేలారని, దీంతో ఆ ఇద్దరు నేతలు వచ్చే ఎన్నికల్లో వైసిపి ఓటమే ధ్యేయంగా పనిచేసేందుకు ఇప్పటి నుంచే గ్రామాల్లో తమ అనుచరులను కలుసుకుంటున్నట్లు సమాచారం. ఇలా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నాయకులు గ్రూపులుగా ఏర్పడడంతోపాటు అసమ్మతి రాగం ఆలపిస్తున్నారు. ఇకపోతే పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా ఏ నాయకుడూ ఆర్థికంగా నిలదొక్కుకోలేదని, సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల వ్యవస్థ వల్ల అంతా ఛిన్నాభిన్నమైందని, అధికారులెవరూ నాయకుల మాట వినటం లేదని వైసిపి నేతలే వాపోతున్నారు. గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బికెలు, ఇతర అభివద్ధి పనులు చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు కాక అప్పులపాలైనట్లు వాపోతున్నారు. బిల్లులు మంజూరు చేయించుకోవడానికి కమీషన్లు ఇచ్చుకోవాల్సిన దుస్థితి దాపురించిందని వాపోతున్నారు. చెంతనే కష్ణానది ఉన్నా గుప్పెడు ఇసుక తెచ్చుకునే పరిస్థితి లేదని, కళ్లముందే లక్షల టన్నుల ఇసుక రవాణా జరుగుతున్నా స్థానికులకు మాత్రం తీసుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నందిగామలో సోమవారం పార్టీ పరిశీలకుల సమక్షాన జరిగిన నియోజకవర్గం స్థాయి సమావేశంలో ఇవే విషయాలను ఏకరువు పెట్టినట్లు తెలిసింది. పార్టీ పరిశీలకులు, ఐ ప్యాడ్ టీం సభ్యులు మండలాల వారీగా నాయకులు, కార్యకర్తల అభిప్రాయాల సేకరించగా, కొందరు వాస్తవ పరిస్థితిని వివరించారు. మరికొందరు మనకెందుకు వచ్చిన గోల, బిల్లులు వచ్చేదాకా, అధికారం ఉన్నంత వరకు విధేయులుగా ఉన్నట్లు నటించి, ఎన్నికల సమయంలో ఓ నిర్ణయానికి రావచ్చుని మిన్నకుండిపోయినట్లు తెలిసింది. మరోవైపు వైసిపి అసమ్మతి నేతలను, కార్యకర్తలను గుర్తించి వారిని తమ పార్టీలోకి తీసుకువచ్చేందుకు టిడిపి నేతలు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు.

తప్పులతడక

చేశారు. ఇప్పటికి చాలా ప్రాంతాల్లో భూహక్కు పత్రాలు పూర్తి స్థాయిలో అందలేదు. భూ హక్కు పత్రాలు పంపిణీ అయిన ప్రాంతాల్లో లోపాలు వెలుగులోకి వస్తున్నాయి.

హడావుడితో చిక్కులు

డ్రోన్ ఫ్లయింగ్ పూర్తయి తర్వాత ఆయా భూములకు సంబంధించిన ఆర్థోరిక్టిపై ఇమేజ్ (ఒఆర్ఐ) తీయాలి. రోవర్‌లు, ఇతర టెక్నాలజీని ఉపయోగించి రీ సర్వే నిమిత్తం భూ యజమానులకు నోటీసులు ఇవ్వాల్సి ఉంది. రీ సర్వేను దగ్గరుండి పరిశీలించుకునే అవకాశం కల్పించడం ద్వారా తప్పులకు అవకాశం లేకుండా ఉంటుంది. అయితే కొందరు భూ యజమానులకు భూ హక్కు పత్రాలు ముద్రణ పూర్తయి ఇంటికి వచ్చే వరకు సమాచారం తెలియడంలేదు. దీంతో లోపాలు చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది

సమస్యలు పరిష్కరిస్తాం

గోపాల్‌రాజా,

ఎడి సర్వే అండ్ ల్యాండ్ రికార్ట్స్, కృష్ణాజిల్లా

రీ సర్వేలో విస్తీర్ణంలో వ్యత్యాసాలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తున్నాం. రంగన్న గూడెంలో తిరిగి రీ సర్వే నిర్వహిస్తాం. లోపాలను త్వరలోనే పరిష్కరిస్తాం.

తుపాను నష్టం 4,162 ఎకరాలకే పరిమితం

3,445 మంది రైతులకు రూ.2.49 కోట్ల పరిహారం

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి : మాండూస్ తుపాను రైతన్నలను నిలువునా ముంచేసింది. అయితే తుపాను నష్టంపై తాజాగా వ్యవసాయ శాఖ ప్రకటించిన జాబితాను చూసిన బాధిత రైతులకు నిరాశే మిగిలుతోంది. తుపాను సమయంలో వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాల్లో 14 మండలాల పరిధిలోని 173 గ్రామాల్లో 22,594 ఎకరాల్లో వరి పంట నష్టం వాటిల్లిందని ప్రిలిమినరీ నివేదికలో పేర్కొంది. అయితే తుది నివేదికలో మాత్రం జిల్లాలో 4,162 ఎకరాల్లో మాత్రమే పంట నష్టం జరిగిందని తేల్చేసింది. ఎకరాకు రూ.15 వేల చొప్పున 3,445 మంది రైతులకు రూ.2.49 కోట్లు అవసరమని ప్రభుత్వానికి పంపిన తుది నివేదికలో పేర్కొంది. దీంతో రైతులకు నామమాత్రంగానే పరిహారం అందే పరిస్థితి నెలకొంది. వేలాది ఎకరాల్లో కోత కోసిన పంట పనలపై ఉండడంతో అవి నీట మునిగి ధాన్యం రంగు మారింది. ఈ నష్టాలను, రైతుల కష్టాన్ని ప్రభ్వుత్వం పరిగణలోకి తీసుకోలేదు. కోత కోయకు ముందు నేలవాలిన 33 శాతానికిపైగా నష్టం వాటిల్లిన పంటలకు సంబంధించిన రైతుల వివరాలను మాత్రమే నమోదు చేశారు.

దావా సమను

మహారాజశ్రీ తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ.1407/2022 ఇన్ ఓ.ఎస్. నెం.2/2021

బిట్వీన్:
శ్రీగునుపల్లి కిశోర్ కుమార్
మరియు
శ్రీబొర్రపురెడ్డి సింహాచలం @ చలం, తండ్రి రామినాయుడు, హిందువు, వ్యాపారం, వయస్సు 57 సం।। లు, డోర్ నెం.3-189, పోరంకి, పెనమలూరు మండలం, విజయవాడ రూరల్, ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ పి.జె.సి.సి .... ప్రతివాది

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన బొర్రపురెడ్డి సింహాచలం అలియాస్ చలం అను మీకు, మీ యొక్క హాజరు నిమిత్తం పలుమార్లు కోర్టు ద్వారా యున్నూ, రిజిస్టర్ పోస్ట్ ద్వారా యున్నూ వాయిదా తెలియజేయుచూ సమన్లు పంపినను, మీకు అమలు కానందున, వాది శ్రీగునుపల్లి కిషోర్ కుమార్ ప్రత్యామ్నాయ మార్గము ద్వారా దావా సమనూలు జారీ చేయ వలసిందిగా కోరుతూ పై నెంబరు ఐ.ఎ 1407/2022 దాఖలు చేయగా కోర్టు వారు మీ యొక్క హాజరు నిమిత్తం ప్రత్యామ్నాయ పద్ధతిలో అనగా పత్రిక ముఖంగా దావా సమాన్లు జారీ చేసి ఉన్నారు. కావున పై నెంబరు దావాలో మీ హాజరు నిమిత్తం తిరువూరు ప్రిన్సి పల్ జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టు లో ది.27- 01- 2023వ తేదీనా ఉద యం గం. 10.30 ని.లకు వాయిదా ఉండి ఉన్నది. సదరు తేదీన కోర్టు వారి ఎదుట మీరు గానీ, మీ తరుపున న్యా యవాది గారి ద్వారా గానీ హాజరై అభ్యంతరములు తెలియజేసుకొనవ లయును. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా పర్యావసానం తీర్మా నించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి అనుమతితో ప్రచురించడం అయినది)

ఇట్లు
మోదుగుమూడి శ్రీనివాసరావు, ఎం.ఎ.బిఎల్,
తిరువూరు **న్యాయవాది, తిరువూరు.**
ది.09-01-2023 **సెల్. 985292197**

మహారాజ శ్రీ నందిగామ కృష్ణాజిల్లా 16వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

G.W.O.P.NO.30/2022

Between:
దార్ల బార్గవి (దార్ల వెంకట భాను ప్రకాష్)
దార్ల వెంకట భాను ప్రకాష్ మైనర్ అయినందున తల్లి భార్గవి గార్డెన్‌గా ...పిటీషనర్
మరియు
నిల్ ...రెస్పాండెంట్

పై నెంబరు G.W.O.P.No.30/2022 పిటీషనర్ తాలుకు ఈ దిగువ షెడ్యూలు దాఖల ఆస్తిని మైనరు తరుపున అమ్మి వారి తదుపరి చదువుల నిమిత్తం ఖర్చు చేయుటకు అమ్ముకొనుటకు శ్రీ నందిగామ కృష్ణాజిల్లా 16వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో పిటిషన్ దాఖలు చేసి యున్నారు. సదరు దాఖలా ఆస్తిని అమ్ముటకు ఎవరికైన ఏవిధమైన అభ్యంతరం ఉన్నచో వారు ది.19-01-2023 తేది ఉదయం గం. 10.30 ని.లకు పైన తెలిపిన కోర్టు వారి ఎదుట మీరు కాని మీ తరుపున న్యాయవాది కాని హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించెదరు. షెడ్యూలు ఆస్తి: కృష్ణాజిల్లా కంచికచర్ల మండలం కంచికచర్ల గ్రామం పంచాయతీ లిమిట్స్ డోర్ నెం.9/141 గల యింటికి ఆర్.ఎస్.నెం. 366/5A హద్దులు : తూర్పు : 3.6 అడుగుల జాయింట్ పాసెజ్ దక్షిణం:దార్ల సోమశేఖర్ , భార్గవి మరియు మీకు అమ్మిన భూమి 36.4
పడమర : 3.6 అడుగుల జాయింట్ పాసెజ్ ఉత్తరం: ఉస్తేల వీర వెంకట నారాయణ గారి యిండ్ల స్థలం
వాయిదా తేది:19-01-2023

(కోర్టు వారి ఉత్తర్వులతో)

మందా వజ్రయ్య,
పిటిషనర్ తరపు న్యాయవాది, నందిగామ.

IN THE HON'BLE COURT OF THE XII ADDL. DISTRICT JUDGE, AT: VISAKHAPATNAM
A.S.176/2020

Between:
Kolli Rambabu ... Appellant
And:
Kolli Appanna & others ...Respondents

NOTICE

To
R-7: Kolli Appala Raju,
S/o. Sanyasi Rao, D.No.9-48-7,
Chilla Appala Narasayya Reddy Street,
4th Lane, Kothapeta, Vijayawada
R-8: Kolli Durga Rao,
S/o. Sanyasi Rao, D.No.9-48-7,
Chilla Appala Narasayya Reddy Street,
4th Lane, Kothapeta, Vijayawada

Whereas, the appellant hereinabove filed the aforesaid appeal against the decree and judgment in O.S.1420/2008 seeking partition and other reliefs. Whereas, it is found to the satisfaction of the Hon'ble Court that you i.e., the respondents 7 & 8 have been evading receipt of notices/summons in the above appeal, consistently. The above mentioned respondents 7 & 8 are there fore hereby directed to appear before the Hon'ble XII Addl. District Judge Court, Visakhapatnam either in person or through an Advocate or duly Authorized agent, in support of your defence to show cause on **08-02-2023 at 10.30 AM** (Forenoon) as to why reliefs prayed for should not be granted. TAKE NOTICE that in case of your default to appear before the Hon'ble XII Addl. District Judge Court, Visakhapatnam, the said appeal will be heard and determined in your absence.

V. SATISH, Advocate,
Visakhapatnam, Cell: 98485 18385

IN THE HON'BLE COURT OF THE X ADDL. DISTRICT JUDGE Cum M.A.C.T, AT: ANAKAPALLI
M.O.P. 266/2020

Between:
Kaparapu Devi & 2 others ...Petitioners
And:
Peluri Hemanth & 2 others ...Respondents

NOTICE

To,
R-2: T. Vamsi, S/o. Sivaji, Hindu, age not known but major, R/at D.No.56-1-43/1, Panta Kaluva Road, Patamata, Vijayawada, Krishna District-520010. (Owner of motorcycle bearing Reg.No. AP 31 BQ 8139)

Please take notice that the above named petitioners herein has filed the above M.O.P. against you and other respondents claiming compensation and the matter stands posted to **31-01-2023** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **31-01-2023** at **10:30 A.M.** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

M.A. PRASAD (Baji), A. RAMAKRISHNA & M. GIRISH
Advocates
Visakhapatnam,
Cell :9246673639

VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)

'e' Procurement Notice No.Rc.E11-100580/2023, Dt.09.01.2023

Sl. No.	Name of Work	Estimate Amount (Rs. in Lakhs)
1	Laying of CC Roads in Adarsh colony in 1st Division and BT Road with Paver Blocks in 24th Division (2 Works under GGMP Funds)	40.00
	Total (2 Works)	40.00

NOTE: Only online Payment towards EMD will be allowed, DDs/P0s/BCs/BGs will not be allowed

Contact for details of works at Office of the Executive Engineer-II, Satyanarayanapuram, Vijayawada, Mobile No.9866514162

Further details can be seen @ 'e' procurement market place
@ **www.tender.apeprocurement.gov.in.**

Down load of bid documents starts for Sl.No.1 & 2 10-01-2023 @ 04.30 P.M
Last date / time for receipt of tenders for Sl.No.1& 2 13-01-2023 @ 05.15 P.M

Sd/- V. Srinivas
For Commissioner .

IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL SENIOR CIVIL JUDGE GUDIWADA
I.A.No.69/2022 in O.S.No.11/2019

Between:
Malireddy Vijaya Lakshmi ....Petitioner/Plaintiff
AND
1)Naidu Satyanarayana(Died)
2)Naidu Rajarajeswari
W/o (Late) Naidu Satyanarayana,
R/o D.No.54-20/1-4A Flat No.102-B Potluri Residency Near N.A.C Kalyana Mandapam, C.T.O Colony Ratna Nagar, Auto Nagar Vijayawada, Krishna District.
3)Naidu Venkata Krishna Chaitanya
S/o (Late) Naidu Satyanarayana,
R/o D.No.54-20/1-4A Flat No.102-B Potluri Residency Near N.A.C Kalyana Mandapam, C.T.O Colony Ratna Nagar, Auto Nagar Vijayawada, Krishna District.
....Respondent/Defendants

పై నెంబరు O.S లో చనిపోయిన 1వ ప్రతివాది అతని వారసులుగా 2,3 ప్రతివాదులు ఒ.యస్ లో చేర్చుటకు పై నెంబరు పిటీషన్ దాఖలు చేసి పలుమార్లు 2,3 ప్రతివాదులకు నోటీసులు పంపగా అమలు జరుగనందున శ్రీ కోర్టువారి ఆదేశముల ప్రకారం పత్రికా ముఖముగా నోటీసులు అమలు ది.19-01-2023న ఉదయం 10-30ని।।లకు వాయిదా అయి ఉన్నది వాయిదా కు హాజరై ఆక్షేపణలు తెలియజేయని యెడల శ్రీ కోర్టువారు పరోక్షంగా తీర్మానించెదరు.

శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం
వాయిదా:19-01-2023

ఇట్లు
కంభంపాటి రవి, అడ్వకేట్,
గుడివాడ, సెల్:9885074158

IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL SENIOR CIVIL JUDGE GUDIWADA
I.A.No.67/2022 in O.S.No.11/2019

Between:
Malireddy Vijaya Lakshmi ....Petitioner/Plaintiff
AND
1)Naidu Satyanarayana(Died)
2)Naidu Rajarajeswari W/o (Late) Naidu Satyanarayana,
R/o D.No.54-20/1-4A Flat No.102-B Potluri Residency Near N.A.C Kalyana Mandapam, C.T.O Colony Ratna Nagar, Auto Nagar Vijayawada, Krishna District.
3)Naidu Venkata Krishna Chaitanya
S/o (Late) Naidu Satyanarayana,
R/o D.No.54-20/1-4A Flat No.102-B Potluri Residency Near N.A.C Kalyana Mandapam, C.T.O Colony Ratna Nagar, Auto Nagar Vijayawada, Krishna District.
....Respondent/Defendants

పై నెంబరు O.S లో చనిపోయిన 1వ ప్రతివాది అతని వారసులుగా 2,3 ప్రతివాదులు ఒ.యస్ లో చేర్చుటకు పై నెంబరు పిటీషన్ దాఖలు చేసి పలుమార్లు 2,3 ప్రతివాదులకు నోటీసులు పంపగా అమలు జరుగనందున శ్రీ కోర్టువారి ఆదేశముల ప్రకారం పత్రికా ముఖముగా నోటీసులు అమలు ది.19-01-2023న ఉదయం 10-30ని।।లకు వాయిదా అయి ఉన్నది వాయిదా కు హాజరై ఆక్షేపణలు తెలియజేయని యెడల శ్రీ కోర్టువారు పరోక్షంగా తీర్మానించెదరు.

శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం
వాయిదా: 19-01-2023

ఇట్లు
కంభంపాటి రవి, అడ్వకేట్,
గుడివాడ, సెల్:9885074158

IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL SENIOR CIVIL JUDGE GUDIWADA
I.A.No.68/2022 in O.S.No.11/2019

Between:
Malireddy Vijaya Lakshmi ....Petitioner/Plaintiff
AND
1)Naidu Satyanarayana(Died)
2)Naidu Rajarajeswari W/o (Late) Naidu Satyanarayana,
R/o D.No.54-20/1-4A Flat No.102-B Potluri Residency Near N.A.C Kalyana Mandapam, C.T.O Colony Ratna Nagar, Auto Nagar Vijayawada, Krishna District.
3)Naidu Venkata Krishna Chaitanya
S/o (Late) Naidu Satyanarayana,
R/o D.No.54-20/1-4A Flat No.102-B Potluri Residency Near N.A.C Kalyana Mandapam, C.T.O Colony Ratna Nagar, Auto Nagar Vijayawada, Krishna District.
....Respondent/Defendants

పై నెంబరు O.S లో చనిపోయిన 1వ ప్రతివాది అతని వారసులుగా 2,3 ప్రతివాదులు ఒ.యస్ లో చేర్చుటకు పై నెంబరు పిటీషన్ దాఖలు చేసి పలుమార్లు 2,3 ప్రతివాదులకు నోటీసులు పంపగా అమలు జరుగనందున శ్రీ కోర్టువారి ఆదేశముల ప్రకారం పత్రికా ముఖముగా నోటీసులు అమలు ది.19-01-2023న ఉదయం 10-30ని।।లకు వాయిదా అయి ఉన్నది వాయిదా కు హాజరై ఆక్షేపణలు తెలియజేయని యెడల శ్రీ కోర్టువారు పరోక్షంగా తీర్మానించెదరు.

శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం
వాయిదా: 19-01-2023

ఇట్లు
కంభంపాటి రవి, అడ్వకేట్,
గుడివాడ, సెల్:9885074158

ఫిర్యాదులకు పరిష్కారం : ఎస్‌పి జాషువా

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలు ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేస్తే వాటిపై చట్టప్రకారం విచారణ చేసి పరిష్కారం అందించడానికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని జిల్లా ఎస్పీ జాషువా అన్నారు. సోమవారం స్పందన పోలీసు కార్యాలయంలో ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వయంగా ఆయన స్వీకరించారు. ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడారు. సమస్య తీవ్రత ఆధారంగా సంబంధిత అధికారులతో మాట్లాడి ఫిర్యాదులను బదిలీ చేసి పరిష్కారం చూపాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు.

స్పందనలో వచ్చిన ఫిర్యాదులు : గుడ్లవల్లేరు నుండి ఇద్దరు పిల్లలు ఉన్న వివాహిత తన భర్త అదనపు కట్నం కోసం మరొక వివాహం చేసుకొని విడాకులు ఇవ్వాలని చూస్తున్నాడని న్యాయం చేయాలని ఫిర్యాదు చేసింది. చల్లపల్లిలో నివాసముంటున్న 80 సంవత్సరాల వద్దుడు నరసయ్య తన ఇద్దరు కుమారులకు ఆస్తిని సమానంగా పంచాడు. అయితే పెద్ద కుమారుడు మతి చెందడంతో కోడలు మనవడు, మనవరాలుతో కలిసి ఉంటూ వద్దుడి పేర ఉన్న ఆస్తిని మనవడి పేరున రాయాలని, చంపుతామని బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేశాడు. పమిడి ముక్కల నుండి శివ తన సమీప బంధువునికి కుటుంబ అవసరాల నిమిత్తం కొంత సొమ్మును అప్పుగా ఇచ్చాడని, సగం చెల్లించి మిగిలిన సగం చెల్లించకపోగా చంపుతానని బెదిరిస్తున్నాడని న్యాయం చేయాలని కోరాడు. పెడనలో నివాసం ఉంటున్న వివాహిత తన భర్త దుర్వేశనాలకు బానిసై చిత్ర హింసలకు గురి చేస్తున్నాడని, పెద్దలతో చెప్పించుకున్నపటికి ప్రయోజనం లేదని న్యాయం చేయమని ఫిర్యాదు చేసింది.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్‌పి జాషువా

టిడిపి జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

నటసార్వభౌముడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు రాష్ట్ర రథసారథిగా ప్రమాణం స్వీకారం చేసి 40 సంవత్సరాలు అయిన సంద ర్భంగా సోమవారం మచిలీపట్నం నియోజకవర్గం కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ జండా ఆవిష్కరణ చేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేసారు. కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు, పోలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర, పామర్రు నియోజకవర్గ ఇంచార్జి వర్ల కుమార్ రాజా, సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధిపై వైసిపిది కపట ప్రేమ : టిడిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : రాష్ట్రంలో దళితులను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కేవలం ఓటు బ్యాంకుకు మాత్రమే పరిమితం చేసారని ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అఖిల్ విమర్శించారు.రాష్ట్రంలో దళితుల అభివృద్ధికి కేటాయించిన నిధులను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని వైకాపా ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించడాన్ని నిరసిస్తూ మచిలీపట్టణం పార్లమెంట్ విభాగ ఎస్సీ సెల్ అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణరావు ఆధ్వర్యంలో సోమవారం కృష్ణా జిల్లా ఎస్సీ కార్పోరేషన్ కార్యాలయన్ని ముట్టడించారు.,ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కోడూరి అఖిల్ మాట్లాడుతూ ఎస్సి కార్పొరేషన్ నిధులను నవరత్నాలకు తరలించడాన్ని హైకోర్ట్ కూడా తప్పు బట్టిందన్నారు. బడుగు, బలహీన, దళిత వర్గాల ప్రభుత్వామని గొప్పలు చెప్పుకునే వైసిపి పార్టీ దళితులకు చేసింది ఏమీ లేదన్నారు. రాష్ట్ర ఎస్సీ సెల్ కార్య నిర్వాహ కార్యదర్శి బుర్మా బాలాజీ, జిల్లా నాయకులు ఉడుముల నరేష్, జిజ్జువరపు భాగ్య రావు పాల్గొన్నారు.

'విజ్ఞాన్ విహార్'లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని విజ్ఞాన్ విహార్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సంక్రాంతి సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా బొమ్మలకొలువు పిల్లల తల్లిదండ్రులచే సంప్ర దాయ వంటలతో ఫుడ్ ఫెస్టివల్ ముగ్గులు వేసి గాలిపటాలు ఎగురవేసి భోగి మంటలు చిన్నారులకు భోగి పళ్ళు పోసి భారతీయ సంస్కృతి సంప్రదాయాలను గురించి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అవనిగడ్డ ఎస్సై కే శ్రీనివాస్ పాల్గొన్నగా విశిష్ట అతిథులుగా ఎస్ వి ఎల్ క్రాంతి కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, బిఈడి కళాశాల ప్రిన్సిపాల్ గుడిసె విష్ణు ప్రసాద్, హెడ్ పోస్ట్ మాస్టర్ సింహాద్రి రామలింగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు

డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా సంక్రాంతి సంప్రదాయం ఉట్టి పడేలా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల కు న్యాయ నిర్ణేతగా పద్మజ శివ పార్వతి వ్యవహరించారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ ద్వితీయ తతీయ బహుమతులు అందజేశారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు చిత్రలేఖనం పోటీల్లో ప్రావీణ్యం చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తెలుగు శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించబడిన విద్యార్థులు చేతిరాత పత్రిక దివిసీమ దివిటీలు ప్రారంభించి

సంవత్సరం పూర్తయిన సందర్భంగా పత్రిక జన్మదిన వేడుకలు కూడా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమానికి శ్రీనివాసరావు పాల్గొన్నారు. నడవడంలో కృషి చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ ఉమారాణి అధ్యక్షతన అర్థశాస్త్ర విభాగాధిపతి వీర కుమారి నేతత్వంలో చాణిక్య క్లబ్ ప్రముఖ అర్థశాస్త్ర అధ్యా పకులు శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభించారు.

క్రాంతి జూనియర్ కళాశాలలో ముగ్గుల పోటీలు

రాబోయే సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని అవనిగడ్డ ఎస్‌విఎల్ క్రాంతి జూనియర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గో రుముచ్చు ఉమా విద్యార్థులు వేసిన రంగవల్లులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో కళాశాల ప్రిన్సిపాల్ లు ఎన్వి నాగేశ్వరరావు, రాజేంద్రప్రసాద్ ముగ్గుల పోటీలను పరివేక్షించారు.

రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-చల్లపల్లి : తుఫానుకు రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పలువురు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పాగోలు గ్రామంలో పంటకళ్ళల్లో ఆరబోసిన ధాన్యాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు పరిశీలించారు. రెక్కలు ముక్కలు చేసుకుని ఆరుగాలం పండించిన పంటకు గిట్టుబాట రాక, ధాన్యం కొనుగోలు చేసే నాధుడు లేక అన్నదాతలు దిక్కుతో పరిస్థితులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకతి వైపరీత్యాలలో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలి అన్నారు. రంగు మారిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో టిడిపి మండల అధ్యక్షుడు మోర్ల రాంబాబు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కోట విజయ రాధిక, మచిలీపట్నం పార్లమెంటరీ మహిళా కార్యదర్శి, చల్లపల్లి గ్రామ సర్పంచ్ పైడి పాముల కృష్ణకుమారి పాల్గొన్నారు

సాయం అందిస్తున్న దృశ్యం

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గన్నవరం : రోడ్డు ప్రమాదానికి గురై కుడికాలు పోగొట్టుకుని బాధ పడుతున్న బుద్ధవరం గ్రామానికి చెందిన నక్క రామాం జనేయులు పరిస్థితి తెలిసి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, మాజీ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు గొంది శివ కోటేశ్వరరావు, మహిళా నాయకురాలు గొంది రాణి, బుద్దవరం సర్పంచ్ బసవరావు చేతుల మీదుగా నగదును బాధితుడు భార్య జ్యోతి కి 25 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా పరంధామయ్య మాట్లాడుతూ బాధల్లో ఉన్నవారికి లేదనకుండా సహాయం చేయడంలో వంశీ ఎప్పుడు ముందు ఉంటారని పేర్కొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

ప్రజాశక్తి-గుడివాడ : ఇటీవల గుడివాడ మండల చిరిచింతల గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి అధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. సోమవారం రూరల్ మండలంలోని చిరిచింతల గ్రామంలో సాంబయ్య ఇంటి సామగ్రి, ఆర్థిక సహాయం అందజేశారు. రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి బవిరె శంకరనాథ్, బ్రాంచ్ చైర్మన్ స్పందన, రెడ్‌క్రాస్ సొసైటి సభ్యులు ఫంటా చంద్రశేఖర్, షమీర్, జనసేన నాయకులు అయ్యప్ప, చరణ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

13న ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు వెలగపూడి రామకృష్ణ మెమోరియల్ స్కూల్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పాఠశాల నుండి ఇప్పటి వరకు చదివిన పూర్వ విద్యార్థులందరితో కలిసి ఈనెల పదమూడున ఆత్మీయ సమ్మేళనం స్వర్ణోత్సవం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల అసోసియేషన్ నాయకులు తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన పత్రిక విలేకరుల సమావేశంలో ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.వి.రావు మాట్లాడుతూ తమ పాఠశాలలో ఇప్పటి వరకు చదివిన విద్యార్థులు అందరూ కలిసి స్వర్ణోత్సవాలకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారని అన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు వెలివెల వెంకట రాజేష్ కుమార్, అసోసియేషన్ నాయకులు పినమాల నాగ కుమార్, కార్యవర్గ సభ్యులు తోట శ్రీనివాసరావు, యంజి రవి కుమార్ పెన్నేరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువశక్తి గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-పెడన : పెడన జనసేన నాయకులు యడ్లపల్లి రామ్ సుధీర్ తోటమూలలో గల పెడన ఫంక్షన్ హాల్‌లో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ సుధీర్ మాట్లాడుతూ యువశక్తితో జనసేన సత్తా చాటుతామని, వైసీపీ ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించడంలో విఫలం చెందిందని పేర్కొన్నారు. స్థానిక మంత్రి జోగి రమేష్ పెడన నియోజకవర్గాన్ని పేకాట క్లబ్బుగా మార్చారని ధ్వజమెత్తారు. కత్తివెన్ను మండలంలో సాగుతున్న అక్రమ చెరువుల తవ్వకాల వెనుక మంత్రి జోగి హస్తం ఉందని ఆరోపించారు. నియోజకవర్గంలో యువత ఉపాధి లేక యువత వలసలు పోతుంటే జోగి రమేష్ చోద్యం చూస్తున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం యువశక్తి గోడ పత్రికను పెడన జనసేన నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి వరుదు రమాదేవి, మత్స్యకార వికాస విభాగం కార్యదర్శి వాడుగు ప్రభాస్ రాజు, కూనపరెడ్డి రంగయ్య, చేనేత విభాగం కార్యదర్శి పేరిసెట్టి విఘ్నేశ్వరరావు పాల్గొన్నారు.

సచివాలయంలోకి ఎందుకొచ్చారు....

- పింఛను అడిగిన బాధితుడిపై సిబ్బంది దురుసు ప్రవర్తనపై స్పందనలో ఫిర్యాదు

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : రాజ్యాంగాన్ని కాపాడుతూ చట్టాన్ని గౌరవిస్తూ ప్రజలకు జవాబుదారితనంతో ఉండాల్సిన సచివాలయ ఉద్యోగులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అనేక పనులపై సచివాలయలకు వచ్చే ప్రజలకు సరైన సమాధానం చెప్పకుండా కులాల గురించి మాట్లాడుతుండడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కంకిపాడు మండలం, గొడవర్రు గ్రామానికి చెందిన అయ్యింకి చిన్నోడు 30 సంవత్సరాలుగా చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం మే 24వ తేదీన చర్మకార్మికుల పింఛనుకు సంబంధించి చిన్నోడు సచివాలయంలో సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగలక్ష్మికు అర్జీ అందజేశారు. జూన్‌లో పింఛను వస్తుందని చెప్పగా జూలై నెలలో వెళ్లి అడుగగా ఎందుకు ఆఫీస్ దగ్గరకు ఇన్నిసార్లు వస్తున్నారు... పింఛను వస్తే నేను ఇవ్వనా అంటూ చిరాకుగా బదులిచ్చారన్నారు. జనవరి 2వ తేదీన మరలా వెళ్లి అడుగగా సోషల్ వెల్ఫేర్ నాగలక్ష్మి, బిల్ కలెక్టర్ నాగరత్నంలు మీరు లోపలికి ఎందుకు వచ్చారు. బయటకు వెళ్ళండి చెప్పులు కుట్టేవారు సచివాలయంలోనికి ఎందుకు వచ్చారని హేళనగా మాట్లాడారు. పింఛను రాలేదని అడిగితే మా దగ్గరకు వస్తావెంటి... వెళ్లి జగన్‌ను అడగండి... అని హేళనగా మాట్లాడుతున్నారని కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులతో కలిసి బాధితుడు ఫిర్యాదు చేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో కె.వి.పిఎస్ జిల్లా అధ్యక్షులు సి హెచ్.రాజేష్, మాజీ అధ్యక్షులు కొడాలి శర్మ, నల్లూరి.చంటి, ఇంటురి వెంకటేశ్వర రావు, చౌరగుడి జ్యోతి,కురగంటి చంటి లు ఉన్నారు.

స్పందనలో వినతిపత్రం అందిస్తున్న కెవిపిఎస్ నాయకులు

యువజనోత్సవాల్లో పిబి సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జరిగిన 36వ దక్షిణ ప్రాంతీయ అంతర్ విశ్వవిద్యాలయాల యువజనోత్సవాల్లో భాగంగా జనవరి మొదటి వారంలో నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో కృష్ణా విశ్వవిద్యాలయం తరపున ప్రాతినిధ్యం వహించిన తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వివిధ అంశాల్లో బహుమతులు సాధించినట్లు పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. డిసెంబర్ నెలలో కృష్ణా విశ్వవిద్యాలయం నిర్వహించిన అంతర్ కళాశాలల యువజనోత్సవాల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన తమ కళాశాల సాంస్కృతిక విభాగం విద్యార్థినీ, విద్యార్థులు సౌత్ జోన్ పోటీల్లోనూ రాణించి శాస్త్రీయ గానంలో ప్రథమ బహుమతి, భారతీయ బందగాన పోటీల్లో ప్రథమ బహుమతి, మెహందీ అలంకరణలో ప్రథమ బహుమతి, శాస్త్రీయ సంగీత వాయిద్య పోటీల్లో ద్వితీయ బహుమతి, లలిత సంగీతంలో ద్వితీయ బహుమతి, రంగవల్లుల పోటీల్లో ద్వితీయ బహుమతి, జానపద సంగీత వాద్య పోటీల్లో తతీయ బహుమతి సాధించి సత్తా చాటినట్లు కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు తెలిపారు. సౌత్ జోన్ పోటీలలో విజయం సాధించిన తమ కళాశాల విద్యార్థులు కృష్ణా విశ్వవిద్యాలయం తరపున ఫిబ్రవరి చివరి వారంలో బెంగళూరు జైన్ విశ్వవిద్యాలయంలో జరిగే జాతీయస్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల యువజనోత్సవాలలో పాల్గొంటారని వెల్లడించారు. గడచిన నాలుగేళ్లుగా కృష్ణా విశ్వవిద్యాలయ యువజనోత్సవాల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించటంతో పాటు భారతీయ విశ్వవిద్యాలయాల సమాఖ్య నిర్వహిస్తున్న ప్రాంతీయ, జాతీయస్థాయి

యువజనోత్సవాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కళాశాల కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేస్తున్న సాంస్కృతిక విభాగం అధ్యాపకులు డాక్టర్ బి.జయప్రకాష్, శివరంజని, నాగ శశాంక, విద్యార్థినీ విద్యార్థులను సిద్ధార్థ అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, పాలడుగు లక్ష్మణరావు, కళాశాల కన్వీనర్ సూరెడ్డి వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ రాజేష్ సి జంపాల అభినందించారు.

'మత్తు'కు దూరంగా ఉంటేనే భవిష్యత్తు : డిఎస్‌పి

ప్రజాశక్తి-వన్‌టౌన్: విద్యార్థులు మత్తు పదార్థాలు (డ్రగ్స్) బారిన పడకుండా వాటికి దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డీఎస్పీ డి. ప్రభాకర్ తెలిపారు. వన్‌టౌన్ కొత్తపేటలో గల పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్‌యస్‌యస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వద్దు - జీవితం ముద్దు అనే అంశంపై డ్రగ్ అవేర్‌నెస్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డీఎస్పీ డి. ప్రభాకర్, భవానీపురం సిఐ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ వాడటం వల్ల తమ జీవితాలు సర్వ నాశనం అవుతాయని, వాటికి అలవాటు పడకుండా దూరంగా ఉండాలని కోరారు. ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నట్లు గుర్తించినట్లయితే తమకు సమాచారం అందించాలని తెలిపారు. టోల్ ఫ్రీ నెం. 14500కు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కె. లక్ష్మణస్వామి గురు, ప్రిన్సిపాల్ డా. జె.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎ.పతంజలి శాస్త్రి, డాక్టర్ ఎస్ మణికంఠ, ఎ.రమాదేవి, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ ఎం.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

'యువశక్తి' జయప్రదం కోరుతూ ప్రచారం

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలో యువశక్తి ప్రచార కార్యక్రమం మూడో రోజు 37వ డివిజన్ అధ్యక్షులు శిగినంశెట్టి రాము గుప్తా ఆధ్వర్యంలో రమణయ్య కూల్ డ్రింక్ షాప్ వద్ద నుంచి బయలుదేరి మెయిన్ బజార్ మోడరన్ కేఫ్ విజయ బ్యాకరీ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకటమహేష్ ప్రతి షాప్‌కు వెళ్లి కరపత్రాలను అందజేస్తూ వ్యాపారస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగన్మోహన్ రెడ్డి పాలన సరిగా లేదని, కొన్ని రోజులు అసలు బోణి కూడా కావడం లేదని, పండగ వస్తే ఆనందం పోయి బాధ కలుగుతుందని, జగన్ పాలన ఎప్పుడు పోతుందా అని ఎదరుచూస్తున్నామని వ్యాపారస్తులు మహేష్ వద్ద వాపోయారు. అనంతరం మహేష్ మాట్లాడుతూ విరాళాల కోసం వెలంపల్లి శ్రీనివాసరావు వ్యాపారస్తుల్ని అనేక సందర్భాల్లో వేధించారని, సమయం కోసం వ్యాపారస్తులందరూ ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తవ్వా మారుతి, కొండేటి దేవానంద్, చల్ల ఏసు బాబు, కిలని రాము యాదవ్, దుర్గారావు, బేతాళం రవికుమార్, మదన స్టాలిన్ శంకర్, కొప్పిరెడ్డి సత్యనారాయణమూర్తి, హనుమాన్ పాల్గొన్నారు.

మొబైల్ అన్న క్యాంటీన్

ప్రజాశక్తి-భవానీపురం: పశ్చిమ నియోజకవర్గంలోని 42వ డివిజన్ భవానీపురం వెలంపల్లి కాలనీలో సోమవారం మొబైల్ అన్న క్యాంటిన్ నిర్వహించారు. మైనార్టీ నాయకులు, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా ఆధ్వర్యంలో కేశినేని ఫౌండేషన్ వారిచే నడపబడుతున్న మొబైల్ అన్న క్యాంటీన్ 69వ రోజు పెద్ది సతీష్ ఆధ్వర్యంలో 42వ డివిజన్ వెలంపల్లి కాలనీలో బీసీ మైనార్టీ నాయకులు నాగుల్ మీరా, యువ నాయకులు కాండ్రేకుల రవీంద్ర చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సాదరబోయిన ఏడుకొండలు, పత్తి నాగేశ్వరరావు, కామా దేవరాజ్, గుర్రంకొండ, పెద్ది సతీష్, పేరాబత్తుల రమణ, నాగోతి రామారావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల పరిశీలన

ప్రజాశక్తి-నందిగామ: పట్టణ శివారు అనాసాగరంలో జగనన్న ఇళ్ల లేఅవుట్లను సిపిఎం బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఎం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి డివి కృష్ణ మాట్లాడుతూ అనాసాగరంలో రెండు వాగుల మధ్యలో పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. వరదలు వచ్చి వాగులు పొంగితే లేఓవుట్లలో వేసిన రోడ్లు, కరెంటు స్థంభాలు సైతం కొట్టుకుపోతాయని తెలిపారు. రోడ్లు వేసి మూడు నెలలు అయినప్పటికీ ప్రభుత్వం ఒక్క ఇంటిని కూడా నిర్మించలేదన్నారు. ఇల్లు నిర్మించుకోవటానికి కనీసం ఆరు అడుగులు మేర పునాదులు తీసుకోవాలని, జగనన్న ఇచ్చే రూ.1.80 లక్షలు ఏమూలకు సరిపోతాయని ప్రశ్నించారు. ఇసుకు ట్రక్కు కిరాయి రూ.2 నుండి 4 వేల వరకు తీసుకుంటున్నారని, ఇళ్ల నిర్మాణాలకు పెరిగిన మెటిరియల్ ధరలకు సుమారు రూ.8 లక్షలు లేనిదే ఇల్లు పూర్తయ్యే పరిస్థితిలేదని చెప్పారు. జగనన్న ఇచ్చిన మొదటి ఆప్షన్ ప్రకారం రూపాయికే పేదల ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నందిగామ పట్టణ కార్యదర్శి కటారపు గోపాల్, నాయకులు సయ్యద్ ఖాసిం, కర్రి వెంకటేశ్వరరావు, వి.రవిశేఖర్, ఆకుల వెంకటనారాయణ, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో జగన్న ఇళ్ల లేఅవుట్లను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు : వెలంపల్లి

ప్రజాశక్తి-వన్‌టౌన్: పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక 34వ డివిజన్‌లోని 227వ సచివాలయం పరిధిలో 163వ రోజు సోమవారం నాడు గడపగడపకు మన ప్రభ్యుత్వం కార్యక్రమం జరిగింది. వెలంపల్లి ఆయా ప్రాంతాలలో పర్యటించి గడపగడపకు వెళ్లి ప్రజలకు ఈ మూడేళ్ల కాలంలో ప్రభుత్వ పరంగా జరిగిన సంక్షేమ పథకాల వివరాలు తెలియచేస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 34వ డివిజన్ కార్పొరేటర్, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి పుణ్యశీల తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి హుండీల ఆదాయం రూ.1.97 కోట్లు

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం మహామండపం ఆరవ అంతస్తులో సోమవారం హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది. మొత్తం 45 హుండీలకు 42 హుండీలను లెక్కించగా 14 రోజులకు నగదు రూ.1,97,67,183, బంగారం 440 గ్రాములు, వెండి 4.880 కిలోలు వచ్చినట్లు ఆలయ ఇఓ దర్భముళ్ల భ్రమరాంబ తెలిపారు. ఆన్‌లైన్ ఈ-హుండీ ద్వారా రూ.24,781 నగదు సమకూరినట్లు పేర్కొన్నారు.

టిడిపి ర్యాలీ

ప్రజాశక్తి-మైలవరం: చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్‌లు కలిస్తే వైసిపి నాయకులు ఎందుకు ఉలిక్కిపడుతున్నారో తెలియటం లేదని మాజీ మంత్రి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. సైకో పోవాలి సైకిల్ రావాలి అని పార్టీ పిలుపుమేరకు సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలన చేతకాక సీఎం జగన్ జీవో నెంబర్ -1 తీసుకొచ్చారని వచ్చే ఎన్నికల్లో జగన్ ఇంటికేనని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఫైనాన్షియల్ ఎమర్జెన్సీ ప్రకటించే పరిస్థితి సీఎం తీసుకువచ్చారన్నారు.

'ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైసిపి పాలన'

ప్రజాశక్తి-వన్‌టౌన్: అభివద్ధి సంక్షేమం లక్ష్యంగా సీఎం జగనన్న పరిపాలన చేస్తున్నారని 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి కొనియాడారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చెరువు సెంటర్లో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి సోమవారం పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ పేద ప్రజల అభివద్ధి ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు, వీరంకి సత్యనారాయణ, అంకాన నాగరాజు, వెలంపల్లి సుబ్బారావు, సర్వోత్తమరావు, ఉస్మాన్ బేగ్, వల్లం రవికుమార్, ఇనుపకుర్తి రాము తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వాటర్ టన్నెల్ ఎక్స్‌పో

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: నగర వాసులకు ఆహ్లాదాన్ని అందించేందుకు ఏర్పాటుచేసిన ఎస్ ఆర్ అండర్ వాటర్ టన్నెల్ ఎక్స్‌పో ఈనెల 29వ తేదీతో ముగియనుందని నిర్వాహకులు తెలిపారు. ఇప్పటి వరకు దుబాయ్, మలేషియా, సింగపూర్ ప్రాంతాలకే పరిమితమైన వాటర్ టన్నెల్ ఎక్స్ పో విజయవాడ నగరవాసులను ఎంతగానో ఆకర్షిస్తోందన్నారు. బందర్ రోడ్డు ఎ కన్వెన్షన్ రోడ్ వజ్ర గ్రౌండ్స్‌లో ఎస్‌ఆర్ అండర్ వాటర్ టన్నెల్ ఎక్స్‌పో విజయవంతంగా సాగుతోంది. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు కార్తికేయ శ్రీనివాస్, మహ్మద్ షమ్మి, అడపా ప్రభాకర్ మాట్లాడుతూ ఎస్‌ఆర్ అండర్ వాటర్ టన్నెల్ పేరిట ఏర్పాటు చేసిన ఎక్స్‌పోలో కనీవినీ ఎరుగని రీతిలో రంగు రంగుల చేపలతో ఈ ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంతోందన్నారు. టన్నెల్‌లో 250 కిలోల చేప మాత్రం ఈ ఎగ్జిబిషన్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో పాటు చూపుతిప్పుకోకుండా చేస్తోందన్నారు.

జెయింట్ వీల్, కొలంబస్, టోరాటోరా, బ్రేక్ డ్యాన్స్, చిన్న పిల్లల ఆటవస్తువులు ఈ ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ ఇటు చిన్నారులు, అటు పెద్దవారికి ఆహ్లాదంతో పాటు ఆనందాన్ని పంచుతున్నాయని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.